

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పల్నాడు జిల్లా వార్తలు
మంగళవారం 20 ఆగస్టు 2024


నాచు, జమ్ము పేరుకుపోయిన తాగునీటి చెరువు



ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు విస్మరించింది. పల్లెల్లోని ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇస్తామన్నారు. కానీ చేతల్లోకి వచ్చేసరికి దారుణంగా విఫలమయ్యారు. జలజీవన్ మిషన్ పథకం పనులను అటకెక్కించారు. ఐదేళ్లు పనులను సాగదీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జలజీవన్ పథకంపై పల్లె ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎన్నికల ముందు కూటమి ప్రతి ఇంటికి కుళాయి ద్వారా స్వచ్ఛజలం అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేసేందుకు ప్రణాళిక రూపొందించాల్సి ఉంది.

జాడలేని కుళాయి!



- అటకెక్కిన జలజీవన్ పథకం
- నీటి పథకాల పనుల సాగదీత
- పల్లెల్లో తాగునీటికి వెతలు
- నిధుల కొరతతో ముందుకు సాగని పనులు
- మూడు జిల్లాల్లో 10.32 లక్షల గృహాలు
- కుళాయిలు ఉన్న గృహాలు 4.51 లక్షల గృహాలు
- కుళాయిల శాతం 43.66
- రాష్ట్రంలోనే చిట్ట చివరన పల్నాడు జిల్లా

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జల్ జీవన్ పథకం ద్వారా పల్లెల్లో ప్రతి వ్యక్తికి 55 లీటర్లు నీరు ఇవ్వడమే లక్ష్యంగా ఈ పథకం రూపొందించారు. ప్రధానంగా ఫ్లోరైడ్ ఉన్న నీటిని సేవించడం వలన ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. పల్నాడు జిల్లాలోని బొల్లాపల్లి, నకరికల్లు మండలాలతో పాటు, గురజాల, మాచర్ల నియోజక వర్గాలలోని అనేక గ్రామాలలో ఫ్లోరైడ్ నీటినే ప్రజలు సేవిస్తున్నారు. ఈ గ్రామాలన్నింటిలో రక్షిత నీరు అందించడం కూడా జల్ జీవన్ పథకం లక్ష్యం. గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న నీటి పథకాలు ప్రతి వ్యక్తికీ 40 లీటర్లు నీరు ఇచ్చే విధంగా రూపొందించారు. వీటి సామర్థ్యం పెంచాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన పనులను గుర్తించి చేపడుతున్నారు. 2019లో ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. తాగునీటి పథకాలను పూర్తి స్థాయిలో పునరుద్ధరించి ప్రతి గ్రామంలో నూరు శాతం కుళాయిల ద్వారా నీరు ఇవ్వాలని కేంద్రం సంకల్పించింది. ఇందుకు ఉమ్మడి జిల్లాలో రూ. 1021.38 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. కేంద్రం తన వాటాగా సుమారు రూ. 275 కోట్లు నిధుల విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా సుమారు రూ. 105 కోట్లు విడుదల చేసింది. ఇంకా మిగతా నిధులు పూర్తి స్థాయిలో విడుదల చేయకపోవడం మిషన్ అమలులో జాప్యం జరుగు తోంది. నిధుల కొరత వెంటాడుతుండటంతో కాంట్రాక్టర్లు పనులు నిలివేస్తున్నారు.

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో 10,32,904 గృహాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 4,51,267 గృహాలకు మాత్రమే కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతున్నది. 43.68 శాతమే గృహాలకు కుళాయిలు ఉన్నాయి. ఇంకా 5,81,637 గృహాలకు కుళాయి కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. అనేక గ్రామాలలో రక్షిత నీటి పథకాలు సక్రమంగా పనిచేయడంలేదు. కుళాయిలు కూడా నామమాత్రంగానే ఉన్నాయి. ఉన్న పథకాలను విస్తరించడంతో పాటు, పైపు లైన్లు, నీటి నిల్వ చెరువుల అభివృద్ధి తదితర పనులు చేపట్టాలని ప్రణాళికలు రూపొందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధ్వర్యంలో పనులు నిర్వహిస్తున్నారు. 2024 మార్చి కల్లా జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులు పూర్తి చేసి ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీరు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. అయితే పనులు ఇంకా నత్తనడకన సాగుతున్నాయి. వందల సంఖ్యలో పనులకు టెండర్లు కూడా నిర్వహించక పోవడం గమనార్హం.

బాపట్ల జిల్లాలో..

బాపట్ల జిల్లాలోని గ్రామాల్లో 3,64,788 గృహాలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ కింద పనులు ప్రారంభించే నాటికి 72,292 గృహాలకు రక్షిత నీటి కుళాయిలు ఉన్నాయి. పథకం అమలులోకి వచ్చిన అనంతరం 76,033 గృహాలకు కొత్తగా నీటి కుళాయిలు ఇచ్చారు. ఇప్పటి వరకు జిల్లాలో1,48,325 గృహాలకు మాత్రమే కుళాయి కనక్షన్‌లు ఉన్నాయి. 19.82 శాతం నుంచి 40.64 శాతంకు కుళాయిల సంఖ్య పెరిగింది. ఇంకా 2,16,463 గృహాలకు కుళాయి కనెక్షన్‌లు ఇవ్వాల్సి ఉంది. ఈ జిల్లా కుళాయి కనెక్షన్‌లలో చివరి నుంచి 2వ స్థానంలో నిలిచింది. జలజీవన్ మిషన్ పథకం కింద 723 పనులు చేపట్టారు. రూ 205.22 కోట్లు వ్యయం అంచనాతో చేపట్టిన పనుల్లో 223 పనులు పూర్తయ్యాయి. 10 గ్రామల్లో నూరు శాతం కుళాయిలు ఇచ్చారు. అమృతలూరు మండలం కొరుతాడిపర్రు, ఇంకొల్లు మండలం భీమవరం, ఇడుపులపాడు, జే పంగులూరు మండలం చందలూరు, నూజెళ్లపల్లి, రామకుర్రు, కారంచేడు మండలం కుంకలమర్రు, పర్చూరు మండలం అడుసుమల్లి, యద్దనపూడి మండలం వింజనంపాడు గ్రామల్లో మాత్రమే నూరు శాతం ఇళ్లకు కుళాయి కనెక్షన్‌లు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

పల్నాడు జిల్లాలో ..

పల్నాడు జిల్లాలోని గ్రామాలలో 4,34,399 గృహాలు ఉన్నాయి. జల్ జీవన్ పథకం ప్రారంభించే నాటికి 58,166 గృహాలకు కుళాయిలు ఉన్నాయి. పథకం ప్రారంభించిన్పటి నుంచి ఇప్పటి వరకు 87,052 కుళాయిలను ఇచ్చారు. జిల్లా అంతటా 1,45,218 గృహాలకు కుళాయిలు ఉండగా ఇంకా 2,89,328 గృహాలకు కుళాయి కనెక్షన్‌లు ఇవ్వాల్సి ఉంది. 33.43 శాతం గృహాలకు మాత్రమే కుళాయిలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ అమలులో రాష్ట్రంలోనే పల్నాడు జిల్లా చిట్ట చివరన నిలిచింది. ఈ పథకం కింద జిల్లాలో 1055 పనులు గుర్తించారు. ఇందుకు సంబంధించి రూ 508.16 కోట్లు వ్యయం అంచనా వేశారు. చేపట్టిన పనుల్లో 209 పనులు పూర్తయ్యాయి. మూడవ వంతు పనులు టెండర్ స్థాయి కూడా దాటలేదు. నిధుల విడుదలలో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసేందుకు ముందుకు రావడంలేదు. కేవలం 13 గ్రామాల్లోనే నూరు శాతం గృహాలకు కుళాయిల కనెక్షన్ ఉన్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ వెల్లడించింది. అమరావతి మండలం జూపూడి, చిలకలూరిపేట మండలం దండమూడి, గొట్టిపాడు, కుక్క పల్లి వారిపాలెం, పొతవరం, తాతపూడి, వేలూరు, యడ్లపాడు మండలం సందెపూడి, సొలస, మాచవరం మండలం చెన్నాయపాలెం, నాదెండ్ల మండలం చిరుమామిళ్ల, రెంటచింతల, వినుకొండ మండలం విఠంరాజు పల్లి గ్రామల్లో నూరు శాతం కుళాయి కనెక్షన్‌లు ఉన్నాయని అధికారులు తెలిపారు.


జలజీవన్ మిషన్ పథకం పైపులు

గుంటూరు జిల్లాలో ...

గుంటూరు జిల్లాలోని గ్రామాల్లో 2,33,717 గృహాలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ కింద పనులు ప్రారంభించే నాటికి 1,24,676 గృహాలకు రక్షిత నీటి కుళాయిలు ఉన్నాయి. పథకం అమలులోకి వచ్చిన అనంతరం 33,048 గృహాలకు కొత్తగా నీటి కుళాయిలు ఇచ్చారు. ఇప్పటి వరకు జిల్లాల్లో 1,57,724 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్‌లు ఉన్నాయి. కుళాయిల శాతం 53.34 శాతం నుంచి 67.49 శాతంకు కుళాయిల సంఖ్య పెరిగింది. ఇంకా 75,993 గృహాలకు కనెక్షన్‌లు ఇవ్వాల్సి ఉంది. ఈ జిల్లా రాష్ట్రంలో 15వ స్థానంలో నిలిచింది. జలజీవన్ మిషన్ పథకం కింద 308 పనులు చేపట్టగా 172 పనులు పూర్తయ్యాయి. ఈ గ్రామల్లో నూరు శాతం కుళాయిలు ఉన్నట్టు అధికారులు తెలిపారు. చేబ్రోలు మండలం గొడవర్రు, కాకుమాను మండలం బీకేపాలెం, బోడిపాలెం, గరికపాడు, పాండ్రపాడు, రేటూరు, అన్నవరం, బొమ్మువానిపాలెం, కుంచవరం, మంగళగిరి మండలం కృష్ణాయపాలెం, పెదకాకాని మండలం అనమర్లపూడి, తక్కెళ్లపాడు, తంగెళ్లమూడి, వెనిగండ్ల, పెదనందిపాడు మండలం కొప్పర్రు, పొన్నూరు మండలం దొప్పలపూడి, జెడవల్లి, ప్రత్తిపాడు మండలం గొట్టిపాడు, కొండవీడు, తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెం, మల్కాపురం, వెలగపూడి, వట్టిచెరుకూరు మండలం కొవెలమూడి, కుర్నూతల, వట్టిచెరకూరు, యామర్రు గ్రామాల్లో ఇంటింటికి కుళాయి నీరు సరఫరా అవుతోందని సదరు అధికారులు తెలిపారు.


ఓవర్ హెడ్ ట్యాంక్

పోషణ కష్టాలు



- అంగన్వాడీలకు ఆగిన సరుకుల సరఫరా
- జులై నెలలో సగం కేంద్రాలకే కందిపప్పు
- మూడో వంతు కేంద్రాలకు ఆగిన పామాయిల్
- సగం కేంద్రాలతో సరిపుచ్చిన పౌర సరఫరాల శాఖ
- వైసీపీ నిర్వాకంతో కుదేలైన పౌర సరఫరాల కార్పొరేషన్
- ఇప్పటికే దెబ్బతిన చౌక సరుకుల పంపిణీ
- తాజా పరిస్థితులతో అంగన్వాడీలపైనా తీవ్ర ప్రభావం

గుంటూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ నిర్వాకంతో నిర్వీర్యమైన వ్యవస్థల జాబితాలో తాజాగా అంగన్వాడీ కేంద్రాలు కూడా చేరుతున్నాయి. అర్ధాకలి జీవితాలు గడిపే పేద సాద తల్లులు, పిల్లల ఆకలి తీర్చి పోషణనిచ్చే అంగన్వాడీ కేంద్రాలు నేడు పోషణ కరువై అల్లాడుతున్నాయి. అంగన్వాడీలకు రావాల్సిన సరుకులు రాక మళ్లీ అదే అర్ధాకలితో తల్లులు, పిల్లలు అగచాట్లు పడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అందుకు కారణం పౌర సరఫరాల శాఖ కుదేలైపోవడమే కారణంగా తెలుస్తోంది.

కందిపప్పు కనుమరుగు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 23 కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 4,405 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలోని 50 వేల మంది గర్భిణులు, 55వేల మంది బాలింతలు, లక్షా 10 వేల మంది మూడేళ్లలోపు చిన్నారులు, లక్షా 32వేల మంది 3 నుంచి 6 సంవత్సరాల చిన్నారులకు వీటిద్వారా ప్రతినెలా పోషకాహారాన్ని అందిస్తున్నారు. పోషణ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ప్రతినెలా 5 లీటర్ల పాలు, 25 గుడ్లు, కిలో కందిపప్పు, 3 కిలోల బియ్యం, అరలీటరు మంచినూనె అందిస్తారు. వీటితోపాటు బాపట్ల జిల్లాలో భాగమైన చీరాల డివిజన్లో మరో వెయ్యి అంగన్వాడీ కేంద్రాలు వున్నాయి వీటిలో సుమారు లక్షమంది బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పోషణ పొందుతున్నారు. ప్రస్తుతం వారిలో సగం మందికి ఈనెల కందిపప్పు, మూడింట ఒక వంతు మందికి పామాయిల్ అందలేదు.

- గుంటూరు జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలకు 24,418 కిలోల కందిపప్పును అందించాల్సి వుండగా, 8,817 కిలోల కందిపప్పు మాత్రమే అందజేశారు. అర కిలో పామాయిల్ ప్యాకెట్లు 17,494 కేటాయించగా 15,560 ప్యాకెట్లు, ఒకలీటరు ప్యాకెట్లు 1,911కుగానూ 1,119 ప్యాకెట్లు మాత్రమే పంపిణీ చేయగలిగారు. పల్నాడు జిల్లాలో 34,990 కిలోల కందిపప్పుకుగానూ 27,885 కిలోల కందిపప్పును, 21,118 అరలీటరు పామాయిల్ ప్యాకెట్లకుగానూ 17,745 ప్యాకెట్ల పామాయిల్, 4,022 లీటర్ ప్యాకెట్లకుగానూ 1,792 ప్యాకెట్లు మాత్రమే సరఫరా చేశారు. బాపట్ల జిల్లాలో 20,845 కిలోల కందిపప్పుకుగానూ 18,799 కిలోలు, 13,378 పామాయిల్ అర లీటరు ప్యాకెట్లకుగానూ 10,379 ప్యాకెట్లు, 2,126 లీటరు ప్యాకెట్లకుగానూ 631 ప్యాకెట్లు మాత్రమే సరఫరా చేశారు. దీంతో మూడు జిల్లాలో వున్న సగం అంగన్వాడీ కేంద్రాల్లో ఈనెల గర్భిణులు, బాలింతలకు అందాల్సిన పోషణ అందలేదు.

సంక్షోభంలో పౌర సరఫరాల కార్పొరేషన్

గత వైసీపీ ప్రభుత్వం పౌర సరఫరాల కార్పొరేషన్‌ను కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. కార్పొరేషన్‌పేరుతో వేల కోట్ల రూపాయల అప్పులు తెచ్చి సంస్థను నిర్వీర్యం చేసింది. దీంతో ప్రతి నెలా సరఫరా చేసి సబ్సిడీ సరుకులు సరఫరా కూడా చేయలేని దీనావస్థకు పౌర సరఫరాల శాఖ దిగజారింది. కూటమి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపడుతున్నప్పటికీ సంక్షోభ తీవ్రత కారణంగా సరైన పరిష్కారం కూడా లభించని పరిస్థితి ఏర్పడింది. అన్ని విధాలుగా సంక్షోభంలో కూరుకుపోయిన పౌర సరఫరాల శాఖ గత రెండేళ్లుగా పేద ప్రజలకు చౌక డిపోల ద్వారా అందించాల్సిన కందిపప్పు, పామాయిల్‌ను కూడా అందించకుండా ఆపేసింది. ఇప్పుడు ఆ సంక్షోభం అంగన్వాడీ కేంద్రాలను చుట్టుముడుతోంది. వైసీపీ హయాంలో ఏడాది క్రితం ఇదే పరిస్థితి వుండగా ఎన్నికలకు రెండు మూడు నెలల ముందు నుంచి పరిస్థితి కొంత మెరుగుపడినట్లు కనిపించింది. తీరా చూస్తే అదే పరిస్థితి మళ్లీ పునరావృతమవుతోంది. ఈ పరిస్థితిని చక్కదిద్దే దిశగా కూటమి ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాం గం చర్యలు తీసుకోక పోతే అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ కార్య క్రమం పూర్తిగా నీరుగారి పోయే ప్రమాదం కనిపిస్తోంది.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

- పెళ్లికి వెళ్లి వస్తూ ముగ్గురు మృతి
- ఆర్టీసీ బస్సును ఢీకొని మరో ఇద్దరు..

సోమవారం జిల్లాలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం చెందారు. నరసరావుపేటకు చెందిన వారు మనుమరాలి నూతన వస్త్ర బహూకరణ వేడుకలకు వెళ్ళి వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, పెళ్ళికి వెళ్ళి వస్తూ పిడుగురాళ్ళకు చెందిన ముగ్గురు మృతి చెందారు.


నాగతేజరెడ్డి


ఇందు


అమూల్య


కనుమూరి ఆంజనేయులు


పద్మావతి

పిడుగురాళ్ల, నాదెండ్ల ఆగస్టు 19: అప్పటిదాకా పెళ్లి వేడుకలలో అందరితో సరదాగా గడిపారు....భోజనాలు పూర్తయ్యాక పెళ్లికి హాజరైన బంధువులు, స్నేహితులతో వీడ్కోలు చెప్పి ద్విచక్రవాహనంపై బయలుదేరి ఆగివున్న లారీని ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు మృత్యువడిలోకి జారుకున్నారు. పిడుగురాళ్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన మారూరి నాగతేజరెడ్డి (25), కొమ్మదల ఇందు (40), కొమ్మదల అమూల్య (19)లు గురజాలలో జరిగిన ఓ వివాహ కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో కొమ్మదల ఇందు పనిచేస్తుంది. నాగతేజరెడ్డి డిగ్రీ పూర్తిచేశాడు. అదే విధంగా కొమ్మదల అమూల్య డిగ్రీ చదువుతుంది. ఇందు, అమూల్యలు తల్లీ కుమార్తెలు కాగా, వీరికి స్నేహితుడుగా వుండే నాగతేజరెడ్డితో కలిసి ద్విచక్ర వాహనంపై గురజాల పెళ్లికి వెళ్లి వస్తూ ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో తుమ్మలచెరువు టోల్‌ప్లాజా సమీపంలో ఆగివున్న లారీని వెనుకవైపు ఢీకొట్టారు. దీంతో ప్రమాద తీవ్రతకు నాగతేజరెడ్డి, ఇందు, అమూల్యలు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న సిఐ వెంకటరావు, ఎస్‌ఐ మోహన్‌లు ఘటనా స్థలానికి చేరుకున్నారు. నాగతేజరెడ్డి తల్లి మారూరి సత్యవతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన వస్త్ర బహూకరణకు వెళ్లి వస్తూ..

మనుమడు, మనుమరాలి నూతన వస్త్ర బహూకరణ వేడుకకు వెళ్ళి వస్తూ వియ్యంకుడు, వియ్యపురాలు కానరాని లోకాలకు వెళ్ళి పోయారు. ఈ ఘటన నాదెండ్ల మండల పరిధిలోని చిలకలూరిపేట - నరసరావుపేట రహదారి పై జరిగింది. అదుపు తప్పిన కారు ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొనటంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయ పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. నరసరావుపేట పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలో నివాసం ఉంటున్న కనుమూరి అంజనేయులు(75)కు ముగ్గురు కుమారులు. ఒక కుమార్తె ఉన్నారు. మూడవ కుమారుడైన శ్రీనివాసరావు ఇటలీలో ఉంటున్నాడు. ఆయన కుమారుడు, కుమార్తెకు బాపట్ల మండలంలోని నరసాయపాలెంలో నూతన వస్త్ర బహుకరణ వేడుక ఏర్పాటు చేశారు. శ్రీనివాసరావు ఇటలీ నుంచి వచ్చే అవకాశం లేక పోవటంతో కోడలు తరుపు వారు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు అంజనేయులుతో పాటు రెండవ కుమారుడు పిచ్చేశ్వరరావు అత్త ఈపూరు గ్రామానికి చెందిన సూరె పద్మావతి(60) తదితరులు సోమవారం వెళ్ళారు. ఆంజనేయులు, ఆయన వియ్యపురాలు అక్కడ కార్యక్రమాన్ని ముగించుకొని ఆంజనేయులు, ఆయన వియ్యపురాలు పద్మావతి, జాష్టి గోపాలకృష్ణ, ఎలియాస్ బాబు, కొల్లి భూపతిలో ఒకే కారులో తిరుగు ప్రయాణం అయ్యారు. అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామ సమీపంలో ప్రకృతి వైద్యశాల వద్దకు వచ్చే సమయానికి వీరు ప్రయాణిస్తున్న కారుకు ఎద్దుల అరక అడ్డం వచ్చింది. దాన్ని తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పిన కారు నరసరావుపేట నుంచి చిలకలూరిపేట వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆంజనేయులు, పద్మావతిలు అక్కడికక్కడే మృతి చెందారు. గాయ పడ్డ భూపతి, బాబులను ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనతో ఆ ప్రాంతంలో విషాదం అలముకుంది. చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బ నాయుడు, ఎస్‌ఐ జీ పుల్లారావు సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు. మృత దేహాలను మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నరసరావుపేట టీడీపీలో.. ఏం జరుగుతోంది

- కట్టు తప్పుతున్న శ్రేణులు..
- ఒకరిపై ఒకరు దాడులు
- నివారణ చర్యలు చేపట్టని వైనం

నరసరావుపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నరసరావుపేట టీడీపీ శ్రేణుల మధ్య అంతర్గత పోరు సాగుతోంది. వరుస సంఘటలు పార్టీకి తల నొప్పిగా మరాయి. పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న వారి మీద స్థానిక నేతలు మెతకవైఖరి అవలంబిస్తుండటంతో, కొందరు పార్టీ నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న వాదన వినిపిస్తోంది. అసలు పార్టీలో ఏం జరుగుతోంది. జరుగుతున్న సంఘటనల వెనుక వాస్తవికత ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన రెండు నెలల వ్యవధిలోనే పలు సంఘటనలు పార్టీలో చోటు చేసుకోవడం గమనార్హం.

తాజాగా తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులు సోమవారం బాహాబాహీకి తలపడ్డాయి. రమేష్, మాబూ ఇరు వర్గాలు ఒకరిపై దాడులు చేసుకున్నాయి. కార్యకర్త ఒకరు కత్తితో హల్‌చల్ చేశాడు. ఈ దాడిలో ఒక వ్యక్తికి కత్తి గాయమైంది. దాడులకు పాల్పడిన ఇరు వర్గాలను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం మాబుపై జరిగిన దాడి నేపథ్యంలోనే మరోసారి టీడీపీ కార్యాలయం వద్ద ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి. ఇళ్ల నిర్మాణం విషయంలో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కార్యాలయం వద్ద ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం పార్టీలో చర్చనీయాంశమైంది.

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఇంటిలోనే ఇటీవల పార్టీలోని రెండు వర్గాలు దాడులు చేసుకున్నాయి. ఈ సంఘటనలో కేసులు కూడా నమోదయ్యాయి. పార్టీ సీనియర్ నేత కొల్లి బ్రహ్మయ్య ఇంటి వద్ద పార్టీ నాయకుడు చల్లా సుబ్బారావు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు అందోళన నిర్వహించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు న్యాయం జరగడంలేదని ఈ సందర్భంగా చల్లా సుబ్బారావు ఆరోపించారు. ప్రకాష్ నగర్‌లోని డాక్యుమెంట్ రైటర్ కార్యాలయం వద్ద టీడీపీ నేతల మధ్య ఇటీవల వాగ్వివాదం చోటు చేసుకుంది. పార్టీలోని ఇరు వర్గాల మధ్య కేబుల్ వివాదం నేపథ్యంలో పరస్పరం కేసులు నమోదయ్యాయి. ఆర్‌యూబీ వద్ద ఎన్‌టీఆర్ విగ్రహావిష్కరణ సందర్భంగా అవిష్కరించిన శిలాఫలకాన్ని పార్టీ నేత ఒకరు పనికట్టుకొని తొలగించారు. ఈ సంఘటన పార్టీలో వివాదానికి దారితీసింది. మునిసిపల్ కార్యాలయ అనుమతి లేకుండా శిలాఫలకాన్ని మర్చారని ఇది సరైన విధానం కాదని పార్టీలోని ఒక వర్గం తన వాదనను వినిపిస్తోంది. విగ్రహం వద్ద రెయిలింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శిలాఫలకం మరొకటి ఏర్పాటు చేసుకోవాల్సింది పోయి, ఉన్న దానిని తొలగించి కొత్తగా శిలాఫలకాన్ని ఏర్పాటు చేయడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. రేషన్ బియ్యం విషయంలో కూడా పార్టీలో నేతలు రెండు వర్గాలుగా విడిపోయినట్లు సమాచారం. వీరి మధ్య కూడా బియ్యం వివాదం కొనసాగుతున్నట్లు పార్టీ నేతలు తెలిపారు. దీనిని నివారించే ప్రయత్నాలు జరగడంలేదన్న విమర్శలున్నాయి.

నేతల మధ్య నెలకొన్న అంతర్గపోరును నివారించే ప్రయత్నాలు పార్టీలో జరగడంలేదన్న వాదన వినిపిస్తుంది. తొలి సంఘటన జరిగిన సమయంలోనే నేతలు సరైన దిశగా చర్యలు తీసుకున్నట్లయితే, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేవన్న అభిప్రాయం పార్టీ నేతల నుంచి వ్యక్త మవుతోంది. రిజిస్ట్రార్ కార్యాలయం మార్చే విషయంలో కూడా పార్టీలో కొందరు నేతల మధ్య అభిప్రాయ బేదాలు నెలకొన్నాయి. కొందరు నేతలు కార్యాలయ భవన యజమానికి మద్దతు ఇస్తుండగా మరో వర్గం వ్యతిరేకిస్తోంది. రిజిస్ట్రార్ కార్యాలయం మార్చాలని రెండు రోజుల క్రితం అరవింద బాబు కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతి పత్రం ఇవ్వడం, భవన య జమానికి మద్దతు ఇస్తున్న వర్గం జీర్ణించుకోలేక పోతున్నది. అంతే కాకుండా ఎన్నికల సమయంలో పార్టీ గెలుపునకు కృషి చేసిన కొందరు సీనియర్ నేతలు కూడా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండడం గమనార్హం.

దిక్సూచి DIKSUCHI



భారత వాయుసేనలో అగ్నివీర్ ఉద్యోగాలు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన భారత వాయుసేన అగ్నిపథ్ స్కీంలో భాగంగా క్రీడల విభాగంలో అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది.

- భారత వాయుసేన- అగ్నివీర్ వాయు(స్పోర్ట్స్) ఇన్‌టేక్ 01/2025

క్రీడాంశాలు: అథ్లెటిక్స్, బాక్సింగ్, క్రికెట్, సైక్లిం గ్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్/డైవింగ్, షూటింగ్, వాటర్ పోలో, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, సైకిల్ పోలో, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హాకీ, స్క్వాష్, కబడ్డీ, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, ఉషు.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియట్/10+2/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత. లేదా ఇంజనీరింగ్‌లో డిప్లొమా కోర్సు(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్/ కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ). నిర్దిష్ట శారీరక దారుఢ్య/వైద్య ప్రమాణాలతో పాటు స్పోర్ట్స్ అచీవ్‌మెంట్స్ తప్పనిసరి.

ఎత్తు: 152 సెం.మీ. కనీస ఎత్తు ఉండాలి.

వయోపరిమితి: 2004 జనవరి 2 నుంచి 2007 జూలై 2 మధ్య జన్మించిన అభ్యర్థులు అర్హులు.

ఎంపిక ప్రక్రియ: సెలెక్షన్ టెస్ట్, స్పోర్ట్స్ స్కిల్ ట్రయల్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా.

దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 29

ట్రయల్స్ వేదిక: తేజస్ క్యాంప్, ఎయిర్ ఫోర్స్ స్టేషన్ న్యూఢిల్లీ, లోక్ కల్యాణ్ మార్గ్, న్యూఢిల్లీ.

వెబ్‌సైట్: https://agnipathvayu.cdac.in/AV/

(నిన్నటి దిక్సూచి తరువాయి)

ఎస్సీ ఉప వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పు-నేపథ్యం

పంజాబ్ రాష్ట్ర పాత్ర

2004లో ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆంధ్రప్రదేశ్ సహా పంజాబ్ రాష్ట్రాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేసింది. 1975లో పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం ఆ రాష్ట్రంలోని ఎస్సీల్లో మరింత అట్టడుగున ఉన్న బాల్మీకి, మజ్‌హబి కులాలను వర్గీకరించి వారికి విద్య, ఉద్యోగాది విషయాల్లో తొలి ప్రాధాన్యం ఇచ్చింది. ఇందుకోసం ఒక జీవోను జారీ చేసింది. 30 ఏళ్లపాటు అమల్లో ఉన్న ఈ విధానం, 2004లో ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో న్యాయవివాదంలో చిక్కుకుంది.

2006లో డాక్టర్ కృష్ణపాల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో, పంజాబ్, హర్యానా హైకోర్టు 1975 నాటి పంజాబ్ రాష్ట్ర జీవో చెల్లదని, ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా తీర్పునిచ్చింది. అయితే ఈ తీర్పును అధిగమించడానికి పంజాబ్ ప్రభుత్వం 'పంజాబ్ షెడ్యూల్డ్ క్యాస్ట్ అండ్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్(రిజర్వేషన్ ఇన్ సర్వీసెస్)యాక్ట్-2006ను తీసుకువచ్చి తిరిగి బాల్మీకి, మజ్‌హబీ వర్గాలకు ఎస్సీ రిజర్వేషన్లలో తొలి ప్రాధాన్యం ఇచ్చారు. 2010లో మరోసారి హైకోర్టు ఈ చట్టాన్ని కొట్టివేసింది. అయితే దేవేందర్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో వచ్చిన ఈ తీర్పును పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. 2014లో ఈ అప్పీలును సుప్రీంకోర్టు అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి సిఫార్సు చేసి, 2004 నాటి ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పును పునఃసమీక్షించాల్సిందిగా సూచించింది. జస్టిస్ అరుణ్‌మిశ్రా నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పును పునః పరిశీలించాలని అభిప్రాయపడింది. ఎస్సీల్లో, ఎస్టీల్లో మరింత ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబాటుకు గురవుతున్న ఉప వర్గాలున్నాయని, ప్రభుత్వాలు, కోర్టులు దీనిని విస్మరించజాలమని అభిప్రాయపడుతూ ఇ.వి.చెన్నయ్య కేసును పరిశీలించిన ధర్మాసనం కూడా తమవలే అయిదుగురు సభ్యులు కలది కావడంతో ఆ తీర్పును తిరగరాయాలంటే మరింత ఎక్కువమంది సభ్యులు గల ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఈ కేసును చేపట్టాలని సిఫార్సు చేసింది. ఈ నేపథ్యంలో 2023 డిసెంబరులో చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలో స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ దేవేందర్‌సింగ్ కేసును పరిశీలించడానికి, ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించడానికి ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పడింది.

ప్రాథమికంగా ఈ రాజ్యాంగ ధర్మాసనం రెండు విషయాలను పరిశీలించింది. అవి 1) రిజర్వేషన్లలో ఉపవర్గీకరణను అమలుచేయాలా? 3) ప్రకరణ 341 ప్రకారం ఎస్సీలు ఒకే సజాతీయ సమూహంగా గుర్తించబడ్డారు కాబట్టి వారిని ఉపవర్గీకరించే అధికారం రాష్ట్రాలకు లేదని తీర్పు ఇచ్చిన ఇ.వి.చెన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసు సమంజసత్వం. ఈ కేసు విషయంగా 2024 ఆగస్టు 1న 6:1 మెజారిటీతో జస్టిస్ చంద్రచూడ్ రాజ్యాం గ ధర్మాసనం తీర్పునిస్తూ ఎస్సీలను ఉపవర్గీకరించే అధికారం రాష్ట్రాలకు ఉందని, 2004 నాటి ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పు చెల్లుబాటు కాదని, సమానత్వాన్ని మరింత పెంపొందించేందుకు అభివృద్ధి ఫలాలు అట్టడుగు స్థాయికి చేర్చేందుకు ఎస్సీల్లోనే కాక, ఎస్టీల్లో కూడా రిజర్వేషన్లు ఉపవర్గీకరించి అమలుచేయాల్సిన ఆవశ్యకత ఉందని, ఆ దిశగా రాష్ట్రాలు చర్యలు తీసుకోవాలని సూచించింది. అదేవిధంగా ఈ తీర్పుతో ఏకీభవిస్తూనే ప్రత్యేకంగా తన తీర్పును వినిపించిన ధర్మాసనం న్యాయమూర్తుల్లో ఒకరైన జస్టిస్ బి.ఆర్.గవాయ్ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో కూడా ప్రభుత్వాలు క్రిమిలేయర్ విధానాన్ని తీసుకువచ్చినప్పుడే అట్టడుగు వర్గాలకు మరింత న్యాయం చేకూరుతుందని సూచించారు. అదేవిధంగా ఉపవర్గీకరణ చేయడానికి సముచిత ప్రాతిపదికలను, వెనుకబాటుతనాన్ని వారి మధ్య గుర్తించడానికి సరైన కొలమానాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఎంచుకోవాలని ఏ ఉపవర్గానికీ 100 శాతం రిజర్వేషన్లను కేటాయించరాదని సూచించారు.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

బంతి రాష్ట్రప్రభుత్వాల కోర్టులో

సుప్రీంకోర్టు తీర్పుతో రిజర్వేషన్ల ఉపవర్గీకరణకు రాష్ట్రాలకు మార్గం సుగమం అయ్యింది. అయితే ఈ ఉపవర్గీకరణను సమర్థవంతంగా పూర్తిచేయడానికి రాష్ట్రాలు కుల గణను సమర్థవంతంగా చేపట్టాల్సి ఉంది. అంతేకాక ఏయే ఉప కులాలు ఆర్థిక, సామాజిక, రాజకీయపరంగా తమ కేటగిరీలోని ఇతర కులాలతో పోల్చినా ఏ స్థాయిలో ఉన్నాయో అంచనా వేయాల్సి ఉంది. ప్రాంతీయపరంగా కూడా వివిధ ఉపకులాల్లో అభివృద్ధిలో అసమానతలు ఉన్నా యి. అంతేకాక ఈ ఉపవర్గీకరణ దళితుల్లోని ఐకమత్యాన్ని దెబ్బ తీయడం తప్ప పెద్దగా ఒన గూడే ప్రయోజనాలు లేవని మాల మహానాడు వంటి సంఘాలు ఉపవర్గీకరణను వ్యతిరేకిస్తున్నాయి.

అంతేకాక ఎస్టీల నుంచి లంబాడాలను తొలగించాలని వారు మైదాన ప్రాంతాల్లో ఉంటూ అభివృద్ధి చెంది ఆదివాసీ కొండజాతి వారి అవకాశాలకు గండికొడుతున్నారని ఆదివాసీ తెగలు ఉద్యమిస్తున్నాయి. ఇట్టి అంతర్గత సంఘర్షణలను సైతం రాష్ట్రాలు ఎదుర్కోవాల్సి ఉంది. సుప్రీంకోర్టు సూచించినవిధంగా ఈ రిజర్వేషన్ల ఉప వర్గీకరణను రాజకీయ ప్రయోజనాల కోసం కాక, సమ సమాజ స్థాపన దిశగా వినియోగించాల్సిన గురుతర బాధ్యత రాష్ట్రప్రభుత్వాలపై ఉంది.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/jse4ruCలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

ఇన్ ప్రోగ్రెస్



కుర్రోళ్ల కష్టం కనిపించింది

నిహారిక కొణిదెల సమర్పణలో రూపుదిద్దుకున్న 'కమిటీ కుర్రోళ్లు' చిత్రాన్ని చూసిన మెగాస్టార్ చిరంజీవి ఆ సినిమా టీమ్‌ను తన ఇంటికి పిలిపించి ప్రత్యేకంగా అభినందించారు. నిహారిక, దర్శకుడు యదు వంశీ తదితరులు ఆయన్ని కలిశారు. 'సినిమా చాలా చక్కగా ఉంది. కొత్త వాళ్లు నటిస్తున్నారనే విషయాన్ని సినిమా చూస్తున్నంతసేపూ మరిచిపోయా. చిత్రీకరణ చాలా సహజంగా ఉంది. ఎంటైర్ యూనిట్ పడిన కష్టం తెరపై కనిపించింది. రీజనబుల్ బడ్జెట్‌లో సినిమా తీసిన దర్శకుడు యదు వంశీకి అభినందనలు' అని ప్రశంసించారు చిరంజీవి.



బ్రహ్మ ఆనందం సందడి

హాస్య బ్రహ్మ బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ తాతా మనవళ్లుగా నటిస్తున్న 'బ్రహ్మ ఆనందం' చిత్రం గ్లింప్స్‌ను రాఖీ పండగ సందర్భంగా సోమవారం విడుదల చేశారు. బ్రహ్మానందం, రాజా గౌతమ్, వెన్నెల కిశోర్ .. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే కథతో వినోదాల విందు వడ్డించడానికి కొత్త దర్శకుడు ఆర్వీఎస్ నిఖిల్ సిద్ధమవుతున్నారు. ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 6న విడుదల చేయనున్నట్లు నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా తెలిపారు.

కన్నప్ప కోసం కంపడు.. గవ్వ రాజు



విష్ణు మంచు నటిస్తూ, ఎంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న 'కన్నప్ప' చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్న నటులకు సంబంధించిన లుక్స్ ఒక్కొక్కటి విడుదల చేస్తున్నారు. ఇందులో కంపడు పాత్ర పోషిస్తున్న ముఖేశ్ రిషి, గవ్వరాజు పాత్ర చేసిన బ్రహ్మాజీ లుక్స్ సోమవారం రిలీజ్ చేశారు. పురాతన పుళింద జాతికి చెందిన అత్యంత భయంకరమైన తెగకు సంబంధించిన పాత్రలు ఇవి. డాక్టర్ మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ షూటింగ్ చివరి దశకు చేరుకుంది. డిసెంబర్‌లో విడుదల కానున్న ఈ చిత్రానికి ముఖేశ్‌కుమార్ దర్శకుడు.

అమ్మాయిలకు ఆమడ దూరం



రాజ్‌తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా నటిస్తున్న 'భలే ఉన్నాడే' చిత్రం ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. అమ్మాయిలంటే ఆమడదూరంలో ఉండే హీరో పాత్రను హిలేరియస్‌గా పరిచయం చేసింది ఈ ట్రైలర్. అలాగే టీవీ గణేశ్, హైపర్ ఆది, కృష్ణభగవాన్, శ్రీకాంత్ అయ్యంగార్ పాత్రలు కూడా వినోదభరితంగా ఉంటాయని దర్శకుడు జె.శివసాయి చెప్పారు. వినాయకచవితి సందర్భంగా సెప్టెంబర్ 7న సినిమాను విడుదల చేస్తున్నట్లు నిర్మాత ఎన్వీ కుమార్ చెప్పారు.

రిలీజ్ డేట్ ఖరారు



తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'వేట్టైయాన్' విడుదల తేదీ ఖరారైంది. అక్టోబర్ పదిన ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణసంస్థ లైకా ప్రొడక్షన్స్ సోమవారం అధికారికంగా ప్రకటించింది. సామాజికపరమైన సమస్యలు తీసుకుని ఆకట్టుకొనేవిధంగా చిత్రాలు తీసే దర్శకుడు టీజె జ్ఞానవేల్ రూపొందించిన తాజా చిత్రం ఇది. లైకా సంస్థ రజనీకాంత్‌తో నిర్మిస్తున్న ఈ నాలుగో చిత్రంలో బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇది అమితాబ్, రజనీకాంత్ కాంబినేషన్‌లో వస్తున్న నాలుగో సినిమా కావడం మరో విశేషం. అలాగే రజనీకాంత్, సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచంద్రన్ కలసి పని చేస్తున్న చిత్రం కూడా ఇదే కావడం గమనార్హం. 'వేట్టైయాన్' చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ లైకా ప్రొడక్షన్స్ హెడ్ జీకేఎం తమిళ్ కుమరన్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. తమిళ, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.



కూర్గ్‌లో పెళ్లి

'రాజావారు..రాణీగారు' చిత్రంలో హీరోహీరోయిన్లుగా నటించిన కిరణ్ అబ్బవరం, రహస్య గోరఖ్‌ల వివాహం ఈ నెల 22న కర్నాటక రాష్ట్రంలోని కూర్గ్‌లో జరుగుతుంది. రహస్య బంధువులంతా కూర్గ్‌లో ఉండడంతో అక్కడే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. సన్నిహితులు, స్నేహితులు, బంధువుల సమక్షంలో ఈ పెళ్లి జరుగుతుంది. దాదాపు ఐదేళ్ల నుంచి ప్రేమలో ఉన్న కిరణ్, రహస్య ఈ ఏడాదే తమ ప్రేమ విషయాన్ని బయట పెట్టారు.

వరల్డ్ ఆఫ్ వాసుదేవ్ : కిరణ్ అబ్బవరం నటిస్తున్న పీరియాడిక్ థ్రిల్లర్ 'క' నుంచి ఫస్ట్ సింగిల్ 'వరల్డ్ ఆఫ్ వాసుదేవ్'ను సోమవారం విడుదల చేశారు. సనాపతి భరద్వాజ పాత్రుడు రాసిన ఈ పాటను కపిల్ కపిలన్ పాడారు. దర్శకద్వయం సుజిత్, సందీప్ విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్న 'క' చిత్రాన్ని త్వరలో తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి విడుదల చేయనున్నారు.

సందేశంతో 'జనక అయితే గనక'



సుహాస్, సంగీర్తన జంటగా నటిస్తున్న చిత్రం 'జనక అయితే గనక'. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్, గోపరాజు రమణ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సందీప్ రెడ్డి బండ్ల దర్శకత్వం వహిస్తున్నారు. దిల్‌రాజు, శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మిస్తున్నారు. ఇటీవలే రిలీజైన ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్ అందరినీ ఆకట్టుకున్నాయి. కథానాయకుడు సుహాస్ పుట్టినరోజు సందర్భంగా.. సోమవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'నా ఫేవరెట్ నా పెళ్ళాం'ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దిల్‌రాజు మాట్లాడుతూ "ఇది చాలా మంచి సందేశంతో నిండిన కథ. పిల్లల్ని కనాలంటే చేతినిండా డబ్బులుండాలి.. పిల్లలకు బెస్ట్ ఇవ్వలేనప్పుడు వారిని కనకూడదు అని ఆలోచించే మనస్తత్వం ఉన్న మధ్య తరగతి వ్యక్తి క్యారెక్టర్‌లో సుహాస్ నటించారు. చాలా రోజుల తర్వాత ఓ మంచి చిత్రం చూశామనే సంతృప్తి ఈ సినిమాతో కలుగుతుంది" అని చెప్పారు. "ఇది నా జీవితంలో మరిచిపోలేని సినిమా అవుతుందనే నమ్మకం ఉంది. ఈ పాటకు విజయ్ బుల్గానిన్ వినసొంపైన సంగీతాన్ని.. కృష్ణకాంత్ ఆకట్టుకునే సాహిత్యాన్ని ఇచ్చారు" అని సుహాస్ అన్నారు. సెప్టెంబరు 7న వినాయక చవితి సందర్భంగా ఈ సినిమా విడుదలవుతోంది.



ఒకే రోజు.. రెండు చిత్రాలు!

సాధారణంగా ఒక హీరో నటించిన రెండు సినిమాలు, ఒక దర్శకుడు తెరకెక్కించిన రెండు సినిమాలూ ఒకే రోజు విడుదలైన సందర్భాలూ ఉన్నాయి. ఇప్పుడు రష్మిక మందన్న విషయంలో అలాంటి పరిస్థితే రిపీట్ అవుతోంది. ఆమె కథానాయిక పాత్రను పోషిస్తున్న 'పుష్ప 2' సినిమా డిసెంబరు 6న విడుదల అవుతోన్న సంగతి తెలిసిందే. అలాగే అదే రోజున రష్మిక నటిస్తున్న మరో చిత్రం 'ఛావా' కూడా విడుదలవుతుండటం ఆసక్తిని కలిగిస్తోంది. విక్కీ కౌశల్ కథానాయకుడిగా లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోందీ చిత్రం. 'పుష్ప' చిత్రం ఉత్తరాదిలో కూడా పెద్ద హిట్ కావడంతో 'పుష్ప2' కోసం అక్కడి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ సినిమా విడుదలయ్యే రోజే 'ఛావా' చిత్రం కూడా విడుదలవుతుందని మేకర్స్ ప్రకటించారు. నిజంగానే ఈ పోటీ ఉంటుందా లేక 'ఛావా' వెనక్కి వెళుతుందా అనేది వేచి చూడాలి

'రాఖీ' స్పెషల్

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగ అందరికీ ప్రత్యేకమయితే.. సినిమా తారలకి మరింత ప్రత్యేకం. ఈ ఏడాది కొందరు తారలు వారి సోదరులతో తీసుకున్న ఫొటోలను.. మరి కొందరు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ త్రోబ్యాక్ పిక్స్‌ను సోషల్‌మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. ఈ ఫొటోలను చూసిన అభిమానులు 'బ్రదర్ సిస్టర్ బాండింగ్' అంటే ఇదేనంటూ తెగ మురిసిపోతున్నారు.



అందరికీ పేరుపేరునా..

"అందరికీ పేరుపేరునా 'రాఖీ పౌర్ణమి' శుభాకాంక్షలు" అని హీరో వరుణ్ తేజ్ తన సోదరీమణులు నిహారిక, సుష్మితతో కలసి తీసుకున్న ఫొటోలను ఎక్స్‌లో పోస్ట్ చేశారు.



నా మార్గదర్శకురాలికి..

అక్కా.. 'రాఖీ పౌర్ణమి' శుభాకాంక్షలు. నా మార్గదర్శకురాలిగా.. సపోర్ట్ సిస్టమ్‌గా ఉన్నందుకు కృతజ్ఞతలు" అని హీరో సుధీర్‌బాబు తన సోదరితో ఉన్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు.

'హ్యాపీ రక్షా బంధన్'



"నా ప్రియ సోదరి మౌని కుట్టీకి.. నన్ను సొంత తోబుట్టువులా భావించే అభిమానులందరికీ 'హ్యాపీ రక్షా బంధన్' అని హీరో సందీప్ కిషన్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు.



"ఒకరినొకరు ఎల్లప్పుడూ ఇలాగే కాపాడుకుంటూ ఉండాలి" అంటూ తన సోదరుడికి రాఖీని కడుతూ నభా నటేశ్ ఓ వీడియోను అభిమానులతో పంచుకున్నారు.

ఇష్టమైన సమయం వచ్చేసింది



"ప్రతీ ఏడాది.. ఈ రోజు ఎంతో ప్రత్యేకం.. మరెంతో ఇష్టం. ఎందుకంటే ఈ రోజు నువ్వు నా కోసం నచ్చిన బహుమతులు తెస్తావు.. నన్ను కాపాడుతానని ప్రేమతో వాగ్దానాలు చేస్తావు.. నేను చెప్పే ప్రతీది వింటావు" అని రకుల్‌ప్రీత్ సింగ్ తన సోదరుడు అమన్‌ప్రీత్ సింగ్‌కు రాఖీ కడుతున్న ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు.



థ్యాంక్యూ అన్నయ్యా..

"థాంక్యూ అన్నయ్యా.. నా బిగ్ బ్రదర్‌గా ఉన్నందుకు" అని మహేశ్‌బాబు కుమార్తె సితార ఘట్టమనేని, తన సోదరుడు గౌతమ్‌తో దిగిన చిన్ననాటి ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు.

నిన్ను బాగా మిస్సవుతున్నాను



"నా బెస్ట్ బ్రదర్‌కి 'హ్యాపీ రక్షా బంధన్'. మనం చిన్నప్పుడు కలసి చేసిన అల్లరినీ.. నిన్నూ ఎంతో మిస్సవుతున్నాను. త్వరలోనే కలుద్దాం" అని హీరోయిన్ తమన్నా భాటియా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పోస్ట్ చేశారు.

వీరితో పాటు అక్షయ్‌కుమార్, సంజయ్‌దత్, సోనూసూద్, సన్నీ డియోల్, కంగనా రనౌత్, పరిణీతీ చోప్రా, భూమి పడ్నేకర్, మనీషా కోయిరాల, రియా చక్రవర్తి, హ్యూమా ఖురేషీ, సారాఅలీ ఖాన్, జెనీలియా దేశ్‌ముఖ్, సోనమ్ కపూర్, కూడా రాఖీ పౌర్ణిమను సెలబ్రేట్ చేసుకుంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు.

అమాయకత్వం..తింగరితనం...



బాలనటిగా వెండితెరపై అడుగుపెట్టి.. పలు చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు రమ్య పసుపులేటి. ఆమె కథానాయికగా నటించిన చిత్రం 'మారుతినగర్ సుబ్రమణ్యం'. రావు రమేశ్, అంకిత్ కొయ్య, ఇంద్రజ నటించిన ఈ చిత్రాన్ని లక్ష్మణ్ కార్య తెరకెక్కించారు. ఈ నెల 23న సినిమా విడుదలవుతున్న సందర్భంగా రమ్య మీడియాతో ముచ్చటించారు.

"ఈ సినిమాలో నా పాత్ర చాలా బాగుంటుంది. అమాయకత్వం, తింగరితనం కలగలిపిన పాత్ర నాది. నా పాత్ర ద్వారా అందరూ హాయిగా నవ్వుకుంటారు. దర్శకుడు లక్ష్మణ్ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. అంకిత్ కొయ్య కలసి నటించడం మరిచిపోలేని అనుభూతి. సెట్స్‌లో రావు రమేశ్, ఇంద్రజ నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఈ సినిమా తప్పకుండా అందర్నీ మెప్పిస్తుంది" అని చెప్పారు.

'తల్వార్' ఆకాశ్ జగన్నాథ్



దర్శకుడు పూరి జగన్నాథ్ తనయుడు ఆకాశ్ జగన్నాథ్ కొత్త చిత్రం 'తల్వార్' షూటింగ్ సోమవారం ఉదయం ప్రారంభమైంది. కొత్త దర్శకుడు కాశీ పరశురామ్‌ని పరిచయం చేస్తూ భాస్కర్ ఇ.ఎల్.వి. నిర్మిస్తున్నారు. ఆకాశ్‌పై చిత్రీకరించిన తొలి షాట్‌కు దర్శకుడు బాబీ కెమెరా స్విచాన్ చేయగా, రచయిత విజయేంద్రప్రసాద్ క్లాప్ ఇచ్చారు. మరో దర్శకుడు సానా బుచ్చిబాబు తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో నటించే ఇతర నటీనటుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని నిర్మాత చెప్పారు.

కశ్మీర్‌కు 'ఎనిమిది వసంతాలు'



'మ్యాడ్' చిత్రంలో నటించి గుర్తింపు పొందిన అవంతిక ప్రధాన పాత్ర పోషిస్తున్న 'ఎనిమిది వసంతాలు' చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నవీన్ యర్నేని, రవిశంకర్ నిర్మిస్తున్నారు. భారీ చిత్రాలనే కాదు కంటెంట్ ఉన్న చిన్న చిత్రాలను కూడా ప్రేక్షకులకు ఆశయంతో వారు ఈ సినిమా తీస్తున్నారు. 'ఎనిమిది వసంతాలు' చిత్రం తదుపరి షెడ్యూల్ కశ్మీర్, ఆగ్రా, వారణాసి ప్రాంతాల్లో జరుగుతుంది.

సెలబ్రిటీ నీకన్న ఎవడురా



సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'గోట్'(గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్స్). దివ్యభారతి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ల నిర్మిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ స్టేజ్‌లో ఉన్న ఈ చిత్రం నుంచి హీరో ఇంట్రడక్షన్ సాంగ్‌ను విడుదల చేశారు. 'బాసే హే నీలా ఉండే లక్కు మాకే లేదురా.. సెలబ్రిటీ నీకన్న ఎవడురా' అంటూ కాసర్ల శ్యామ్ రాసిన పాట ఇది. 'పుష్ప 2'లో టైటిల్ సాంగ్ పాడిన దీపక్ బ్లూ ఈ పాట పాడడం విశేషం. 'ఇప్పటివరకూ ఎనభై శాతం చిత్రం పూర్తయింది. యాక్షన్ ఎపిసోడ్స్ రెండు పాటలు మిగిలి ఉన్నాయి. వాటిని కూడా త్వరలో చిత్రీకరిస్తాం' అని నిర్మాత చెప్పారు.



హీరో కృష్ణ అభిమాని సినిమా

కృష్ణసాయి, మీనాక్షి జైస్వాల్ జంటగా నటిస్తున్న 'జ్యూవెల్ థీఫ్' చిత్రం టీజర్ నటుడు పృథ్వీ విడుదల చేశారు. 'నేను హీరో కృష్ణగారి అభిమానిని. ఆయన స్ఫూర్తితోనే సినిమాల్లోకి వచ్చా. ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్ అని చెప్పారు కృష్ణసాయి. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాత మల్లెల ప్రభాకర్ చెప్పారు.



అన్న క్యాంటీన్లో భోజనం చేస్తున్న పెమ్మసాని, నసీర్, రాజేంద్ర ప్రసాద్

ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు: కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రూ.200 ఖర్చుపెట్టినా కాఫీ, టీలు దొరకని ఈ రోజుల్లో కేవలం రూ.5కే అన్నం పెట్టడం అంటే సాధారణ విషయం కాదని కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు బస్టాండు సమీపంలో ఇటీవల ప్రారంభించిన అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే నసీర్, కాంటినెంటల్ కాఫీ సంస్థ అధినేత రాజేంద్రప్రసాద్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. అన్న క్యాంటీన్‌కు వచ్చిన ప్రజలకు దగ్గరుండి వడ్డన చేశారు. అనంతరం అక్కడి ప్రజలతో మాట్లాడి భోజనం నాణ్యత, రుచి, సౌకర్యాలపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అక్కడే వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడారు. నిత్యం 350మందికి ఒక్కో అన్న క్యాంటీన్ ద్వారా భోజనం అందిస్తున్న ఘనత టీడీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. భోజనం రుచికరంగా వుందని ఆయన చెప్పారు. పరిసరాలు, మెనూ సంతృప్తికరంగా వుందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనపై పెమ్మసాని పిలుపునందుకుని చొరవ చూపి తనను కలవడానికి వచ్చిన కాంటినెంటల్ కాఫీ అధినేత రాజేంద్రప్రసాద్‌ను ఆయన అభినందించారు. గుంటూరు జిల్లాలో పరిశ్రమలు లేని రోజున కాంటినెంటల్ కాఫీ సంస్థను స్థాపించిన రాజేంద్రప్రసాద్ వంటివారు నేడు ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా పలువురు తెలుగు మహిళలు పెమ్మసానికి రాఖీ కట్టారు. ఎల్లప్పుడూ అన్నయ్యలా తోడుంటానని పెమ్మసాని వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీల, పోతురాజు సమత, సయ్యద్ ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్లకు క్యూఆర్ కోడ్ పరికరాల అందజేత



క్యూ ఆర్ కోడ్ డిస్‌ప్లే పరికరాలను అందజేస్తున్న గుంటూరు రైల్వే డీఆర్ఎం ఎం రామకృష్ణ

గుంటూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే నుంచి వచ్చిన క్యూఆర్ కోడ్ డిస్‌ప్లే పరికరాలను గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ డివిజన్ కమర్షియల్ విభాగం అధికారులకు అందజేశారు. సోమవారం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో ఆయన సీనియర్ డీసీఎం సీహెచ్ ప్రదీప్‌కుమార్, డీసీఎం కమాలకర్‌బాబులకు అందించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ డిజిటలైజేషన్‌లో రైల్వేశాఖ ఎంతోచొరవ చూపుతున్నదన్నారు. ఈ క్యూఆర్ కోడ్ డిస్‌ప్లే పరికరాలు ప్రయాణీకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. టిక్కెట్ ఛార్జీని క్యూఆర్ కోడ్ స్కానర్‌లో స్కానింగ్ చేసి చెల్లింపు చేయవచ్చన్నారు. దీనివలన నగదు రహిత లావాదేవీలు పెరుగుతాయన్నారు. కౌంటర్ల వద్ద చిల్లర కష్టాలు కూడా తీరిపోతాయని చెప్పారు.

అందరికి అండగా ఉంటా...

- మంత్రి లోకేశ్ భరోసా
- 27వ రోజు ప్రజాదర్బార్‌కు విన్నపాల వెల్లువ



వైద్యసాయం కోసం వచ్చిన వృద్ధుల్ని పరామర్శిస్తున్న లోకేశ్



తాడేపల్లి, ఆగస్టు 19: సమస్యలతో వచ్చే ప్రతి ఒక్కరికి అండగా నిలుస్తామని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఉండవల్లిలోని నివాసంలో 27వ రోజు సోమవారం ప్రజాదర్బార్‌కు మంగళగిరితోపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. నేరుగా మంత్రిని కలిసి సమస్యలను విన్నవించారు. ప్రతి ఒక్కరి విజ్ఞప్తిని పరిశీలించిన మంత్రి లోకేశ్... అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సమస్యల సత్వర పరిష్కారానికి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

సమస్యలిలా...

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి విచారణ లేకుండా తన భర్తపై అక్రమంగా కేసు నమోదు చేసి, ఇంట్లోని 148 గ్రాముల బంగారాన్ని పోలీసులు దౌర్జన్యంగా తీసుకెళ్లారని మంగళగిరికి చెందిన అందె స్వర్ణలత మంత్రి లోకేశ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ అంకమ్మరావు, ఎస్ఐ నారాయణ తమను వేధించారని, విచారించి తగిన న్యాయం చేయాలని కోరారు. దివ్యాంగురాలైన తనకు ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లికి చెందిన ఎస్ కృష్ణవేణి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం తొలగించిన దివ్యాంగ పెన్షన్‌ను పునరుద్ధరించాలని నవులూరుకు చెందిన సోలా శ్రీదేవి కోరారు. రోజువారీ పనులతో జీవనం సాగించే తనకు రాజధాని రైతు కూలీ పెన్షన్ మంజూరు చేయాలని ఉండవల్లికి చెందిన టి కిషోర్ విజ్ఞప్తి చేశారు. భర్త చనిపోయిన తనకు ముగ్గురు పిల్లల పోషణ కోసం ఎయిమ్స్ ఆసుపత్రిలో సెక్యూరిటీ ఉద్యోగం కల్పించాలని తాడేపల్లికి చెందిన కె.ప్రసన్న కోరారు. వైసీపీ నాయకుల అండగా ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం చౌటూరులో తమ 220 గజాల స్థలాన్ని కబ్జా చేశారని తగిన న్యాయం చేయాలని మంగళగిరికి చెందిన అడపా మస్తాన్‌రావు విజ్ఞప్తి చేశారు. నర్సింగ్ కోర్సు సర్టిఫికెట్ ఇవ్వకుండా కాలేజీ యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తోందని సర్టిఫికెట్ మంజూరుచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రాతూరుకు చెందిన అనూష కోరారు. ఈఎస్ఐ కింద గుండె ఆపరేషన్ చేయించుకున్న తనకు బిల్లులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కాజకు చెందిన కె శివరామకృష్ణ విజ్ఞప్తి చేశారు. నూతనంగా నిర్మించుకున్న తన ఇంటికి దారి ఇవ్వకుండా వైసీపీ నేతలు అడ్డంగా గోడ కట్టారని, నెల్లూరు జిల్లా వరికుంటపాడు గండిపాలెంకు చెందిన డి తిరుపతమ్మ కన్నీటిపర్యంతమయ్యారు. విచారించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎలాంటి ఆధారం లేని తమకు ఇల్లు మంజూరుచేసి ఆదుకోవాలని విజయవాడకు చెందిన హరిత విజ్ఞప్తి చేశారు. అగ్రికల్చర్‌లో డిప్లమో చేసిన తాను ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సీడ్ ప్రొడక్షన్‌లో శిక్షణ పొందానని తగిన ఉద్యోగం కల్పించాలని ప్రకాశం జిల్లా గద్దలకుంటకు చెందిన పిల్లి ప్రసన్నకుమారి విజ్ఞప్తి చేశారు. కేన్సర్‌తో బాధపడుతున్న తనకు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని పల్నాడు జిల్లా మేళ్లవాగుకు చెందిన యు వెంకటేశ్వర్లు కోరారు. వారసత్వంగా వచ్చిన తమ ఏడెకరాల అసైన్డ్ భూమిని వైసీపీ నేతలు నకిలీపత్రాలతో కబ్జా చేశారని విచారించి తగిన న్యాయం చేయాలని నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం సాతానుపల్లికి చెందిన కంచర్ల హజరత్తమ్మ మంత్రి లోకేశ్‌ను కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. డ్రిస్టిక్టు స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నియామకంలో నిబంధనలు సడలించి వ్యాయామ ఉపాధ్యాయులకు తగిన న్యాయం చేయాలని కోరారు.

ఎయిమ్స్‌లో అతి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం

ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



జెండా ఊపి బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, ఆగస్టు 19: మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్‌లో అతి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మాచర్ల పట్టణంలో ఆర్టీసీ డిపో నుంచి మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్‌కు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీస్‌ను సోమవారం ఆయన జెండా ఊపి, బస్ స్టార్ట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విభజన జరిగినప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు కేంద్రప్రభుత్వంతో మాట్లాడి అత్యాధునిక సదుపాయాలతో మంగళగిరిలో ఎయిమ్స్ హాస్పిటల్‌ను ఏర్పాటుచేశారన్నారు. పల్నాడు ప్రాంత ప్రజలు ఎయిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స చేయించుకునేందుకు గుంటూరు వరకు వెళ్లి అక్కడి నుంచి హాస్పిటల్‌కు చేరుకోవడానికి పలు ఇబ్బందులు పడుతున్నారని, వారికోసం ప్రత్యేకంగా నేరుగా హాస్పిటల్ వద్దకు చేరుకునేందుకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సహకారంతో బస్సు సర్వీసు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. అనంతరం డిపో మేనేజర్ రెంటచింతల పిచ్చయ్యను అభినందించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, బండ్ల శ్రీనివాసరావు, వజ్రం నాయక్, మదార్‌సాహెబ్, కొమెర శివ, గుండాల శ్రీనివాస్ యాదవ్, తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివా రెడ్డి, శేషు, చల్లా రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

మమతానురాగాల బంధమే రక్షాబంధన్

- మంత్రి అనగానికి రాఖీ కట్టిన సోదరీమణులు





మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు రాఖీ కడుతున్న సోదరీమణులు డాక్టర్ మంజుల, డాక్టర్ కమల

రేపల్లె, ఆగస్టు 19: హిందూ సాంప్రదాయం ప్రకారం శ్రావణ మాసంలో రాఖీ పౌర్ణమిని జరుపుకుంటారు. సోదరి తన సోదరుడికి రాఖీ కట్టటం అంటే సోదరికి జీవితాంతం రక్షగా ఉంటానని సోదరుడు భావించే పండుగ. అన్నాచెల్లెళ్ళు అక్కాతమ్ముళ్ళ మధ్య ప్రేమానురాగాలకు సూచికగా రక్షాబంధన్ పండుగను ఘనంగా సోమవారం జరుపుకున్నారు. శ్రావణమాసం రాఖీపౌర్ణమి సందర్భంగా రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్, సోదరుడు శివప్రసాద్‌లకు సోదరీమణులు డాక్టర్ అనగాని మంజుల, కమల రాఖీ కట్టి హారతులు ఇచ్చి మిఠాయిని తినిపించి వారి ఆశీర్వాదం పొందారు. రేపల్లె నియోజకవర్గంలోని చెరుకుపల్లిలో జన్మించిన మంత్రి అనగాని సత్యప్రసాద్ కుటుంబం తండ్రి రంగారావు వృత్తిరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ప్రతి సంవత్సరం రాఖీ పౌర్ణమి రోజున తమ సోదరులైన శివప్రసాద్, సత్యప్రసాద్‌లకు రాఖీ కట్టి వారి ఆశీస్సులు తీసుకుంటామని తెలిపారు. 40 ఏళ్ళ నుంచి వృత్తిరీత్యా వేర్వేరు చోట్ల ఉన్నా రాఖీ పౌర్ణమిరోజున కుటుంబసభ్యులంతా హైదరాబాద్‌లోని తమ స్వగృహంలో చేరి సోదరులకు రాఖీ కట్టి పండుగ జరుపుకుంటామని తెలిపారు.

క్యాంటీన్‌ల వద్ద ఎండలో అవస్థలు

- నీడ కల్పించే అంశంపై ఆలోచన చేయాలి
- పేదల కడుపు నింపుతున్న అన్న క్యాంటీన్‌లు



నరసరావుపేటలోని అన్న క్యాంటీన్ వద్ద ఎండలోనే క్యూలో ఉన్న పేదలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అన్న క్యాంటీన్‌లు రోజూ వేలాది మంది కడుపు నింపుతున్నాయి. మూడు పూటలా క్యాంటీన్‌ల వద్ద పేదలు బారులు తీరుతున్నారు. ఒక్కొక్క క్యాంటీన్‌లో నాలుగు రోజుల్లో దాదాపు ఆరువేల మంది అల్పాహారం, భోజనం చేశారు. కూటమి ప్రభుత్వం పేదల ఆకలి తీర్చడంలో భరోసా కల్పించింది. ఎంతో ఆనందంగా అన్న క్యాంటీన్‌లకు పేదలు తరలివస్తున్నారు. రుచి, నాణ్యత గల ఆహారాన్ని ప్రభుత్వం క్యాంటీన్ ద్వారా పేదలకు అందిస్తోంది. అన్ని బాగున్నా చిన్న సమస్య పేదలను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఉదయం అల్పాహారం, రాత్రి భోజనం సమయాల్లో ఇబ్బందులు లేవు. ఎటొచ్చి మధ్యాహ్నం భోజన సమయంలో క్యాంటీన్ వద్ద పేదలు అవస్థలు పడుతున్నారు. ఆ సమయంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుండటంతో క్యాంటీన్ వద్ద క్యూలో ఉండాలంటే చాలా ఇబ్బందిగా ఉందని వారు చెబుతున్నారు. క్యాంటీన్‌ల వద్ద నీడ ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ దిశగా ప్రభుత్వం క్యాంటీన్‌ల వద్ద చర్యలు చేపడితే పేదల ఇంకా సంతోషిస్తారు.

ఎన్‌ఆర్‌ఐ కోటాలో బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సుకు 21న మాన్యువల్ కౌన్సెలింగ్

లాంఫాం(తాడికొండ), ఆగస్టు 19: ఈనెల 21వ తేదీన బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ ఎన్‌ఆర్‌ఐ కోటాలో మాన్యువల్ కౌన్సెలింగ్ జరుగుతుందని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జీ రామచంద్రరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లాంఫాంలోని కృష్ణ ఆడిటోరియంలో 21వ తేదీ ఉదయం 9గంటలకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ఎంపీసీ విభాగంలో బీటెక్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సులకు, రైతు కోటా కింద మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సెలింగ్ జరుగుతుందని తెలియజేశారు. అర్హులైన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరవ్వాలని పేర్కొన్నారు.

నేడు రాష్ట్ర లీగల్ సెల్ సమావేశం

తుళ్లూరు, ఆగస్టు 19: మండల పరిధిలోని వెలగపూడి సచివాలయం వద్ద గల రాష్ట్ర లీగల్ సెల్ అథారటీలో మంగళవారం జనరల్ మీటింగ్ జరగనుంది. మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ సోమవారం ఒక ప్రకటలో తెలిపింది.

ప్రకాశం బ్యారేజి దిగువకు 25వేల 550 క్యూసెక్కులు

- డెల్టా కాలువలకు 17వేల 477 క్యూసెక్కులు



ప్రకాశం బ్యారేజి నుండి దిగువకు విడుదలవుతున్న వరదనీరు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 19: ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి నుండి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుంచి 43వేల క్యూసెక్కుల వరదనీరు సోమవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదలశాఖ జేఈ అజముద్దీన్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 35 గేట్లను 1 అడుగు మేర ఎత్తి దిగువకు 25వేల 550 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 17వేల 477 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, ఆగస్టు 19: నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం నాటికి 590.00 అడుగులు ఉంది. ఇది 311.14 టీఎంసీలకు సమానం. కుడికాల్వ ద్వారా 8067క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 5367, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,110, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 600, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 49,944 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లోగా 49,944 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలకు 24వేల క్యూసెక్కుల నీరు విడుదల

1.007 ఎంయూల విద్యుదుత్పత్తి: ఎస్‌ఈ కె.వెంకటరమణ

రెంటచింతల, ఆగస్టు 19: సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టునుంచి దిగువన వున్న పులిచింతలకు 24వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్‌ఈ కె.వెంకటరమణ చెప్పారు. ప్రాజెక్టుకు చెందిన 2 గేట్లను ఒక మీటర్ మేర, 1 గేట్‌ను మీటరున్నర మేర ఎత్తి 15,500, విద్యుదుత్పత్తి అనంతరం టేల్‌రేస్ ఛానల్ ద్వారా 8500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ఆదివారం అర్ధరాత్రి 12గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 1.007 ఎంయూల విద్యుత్ తయారైందన్నారు. రిజర్వాయర్‌లో 7 టీఎంసీల నీరుండగా ఆ నీరు 74.45 మీటర్లకు సమానమన్నారు. సాగర్ నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లు పంపుతున్నామన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 19: పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 16వేల క్యూసెకుక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని తెలిపారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య



బొడ్డు వెంకటరావు (పాత చిత్రం)

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 19: బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అబ్బూరులో సోమవారం జరిగింది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కంకణాలపల్లి గ్రామానికి చెందిన బొడ్డు వెంకటరావు(32) అబ్బూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వర్కర్‌గా పని చేస్తున్నాడు. విధులకు హాజరైన వెంకటరావు సబ్‌స్టేషన్ నుంచి బయటకు వచ్చి గ్రామ సమీపంలోని వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది గమనించిన వ్యవసాయకూలీలు, రైతులు సబ్‌స్టేషన్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. బంధువులు ఘటనాస్థలానికి వచ్చి బావిలో నీటిని ఇంజన్‌ల ద్వారా బయటకు తోడి మృతదేహాన్ని బయటకు తీశారు. రూరల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. వెంకటరావుకు ఏడాదిన్నర క్రితం గణపవరం గ్రామానికి చెందిన శైలజతో వివాహం జరిగింది. వీరికి రెండునెలల వయసున్న బాలుడు ఉన్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

పశ్చిమడెల్టా కాల్వకు 7837 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఆగస్టు 19: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టా కాల్వకు 7837క్యూసెక్కుల సాగునీటిని సోమవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దిగువకు 25,550 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 340క్యూసెక్కులు, రేపల్లెకాల్వకు 1889, తూర్పు కాల్వకు 767, పశ్చిమకాల్వకు270, నిజాంపట్నంకాల్వకు 458, కొమ్మమూరుకాల్వకు 3260క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

718 బస్తాల పసుపు విక్రయం

స్థానిక పసుపుమార్కెట్‌యార్డులో సోమవారం జరిగిన వేలంలో 718బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్టధర రూ.10,000, గరిష్టధర రూ.12,800, మోడల్ ధర రూ.12,800పలికాయి. కాయక్వింటాల్‌కు కనిష్టధర రూ.10,000, గరిష్టధర రూ.12,800, మోడల్‌ధర రూ.12,500 పలికాయి.

ఫొటోగ్రఫీ ఒక శాస్త్రం

- సమాజాన్ని కదిలించేది.. మానవత్వాన్ని చాటేది ఫొటోగ్రఫీ
- ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్
- ఏఎన్‌యూలో ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, వేదికపై వీసీ గంగాధరరావు తదితరులు

పెదకాకాని, ఆగస్టు 19: ఫొటోగ్రఫీ అనేది ఒక శాస్త్రమని.. దానిని గుర్తించి నేడు ప్రత్యేక కోర్సుగా తీసుకురావడం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగంలో డిప్లమా ఇన్ ఫొటోగ్రఫీ కోర్సు ఆధ్వర్యంలో సోమవారం 185వ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సీనియర్ ఫొటోగ్రాఫర్ టి.శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఫొటోగ్రఫీ సమాజంలోని సంఘటనల గుర్తింపునకు ఒక అస్త్రంగా పనిచేస్తుందన్నారు. ఒక ఫొటో సమాజాన్ని కదిలించేదిగా, అలాగే మానవత్వాన్ని చాటేదిగా నిలుస్తుందన్నారు. ఆచార్య నాగార్జునవిశ్వవిద్యాలయం జర్నలిజం విభాగానికి ఫొటోగ్రఫీ కోర్సు ఒక ఆణిముత్యం అన్నారు. ఏఎన్‌యూ ఇన్‌ఛార్జి వీసీ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు మాట్లాడుతూ ఒక్క ఫొటో ద్వారా కొన్ని వార్తలను క్రియేట్ చేయవచ్చన్నారు. ఫొటోగ్రఫీ వృత్తిలో ఉంటూ డిప్లమా కోర్సు పూర్తిచేసినవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. గౌరవ అతిథి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి మాట్లాడుతూ చదవలేని పుస్తకంగా రాయలేని కవితగా ఫొటోగ్రఫీ నిలుస్తుందన్నారు. జర్నలిజం, ఫొటోగ్రఫీ విభాగాధిపతి డాక్టర్ జి.అనిత మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో జర్నలిజం కోర్సు ద్వారా ప్రతిఏడాది అనేకమంది జర్నలిస్టులను సమాజానికి పంపుతున్నట్లు చెప్పారు. ఫొటోగ్రఫీ విభాగం ఆధ్వర్యంలో మూడు ప్రత్యేకమైన ఎగ్జిబిషన్లను ఏర్పాటుచేశామన్నారు. ఈ సందర్భంగా నాలుగు పుస్తకాలను విడుదల చేశారు. కవిత అనే ప్రత్యేక సంచికతోపాటు ఆధునిక ఫొటోగ్రఫీ పితామహుడు జార్జ్ ఇష్టమన్ జీవితంపై పుస్తకాన్ని, ఫొటోగ్రఫీ పదకోశం పుస్తకాన్ని కాంటెస్ట్‌లో విజేతల ఫొటోలతో ముద్రించిన క్యాటలాగ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. పోటీలకు 800కు పైగా వచ్చిన ఎంట్రీలలో ఉత్తమమైన ఫొటోలను ఎంపికచేసి విజేతలకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో జర్నలిజం విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ జ్యోతిర్మయి, డాక్టర్ మధుబాబు, అధ్యాపకులు డాక్టర్ మాణిక్యరావు, ఫొటోగ్రఫీ కోర్స్ అధ్యాపకులు డాక్టర్ విజయభాస్కర్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

కిడ్నీ మార్పిడి బిల్లులు అడుగుతుంటే దాడి చేసి కొట్టారు

- ఆసుపత్రి సిబ్బందిపై ఎస్పీ కార్యాలయంలో బాధితురాలి ఫిర్యాదు



యడ్లపాటి సునీత

గుంటూరు, ఆగస్టు 19: తన తల్లికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌కు సంబంధించి ఆసుపత్రి బిల్లులు ఇవ్వమని అడిగితే తనపై ఆసుపత్రి వైద్యుడి ముందే సిబ్బంది దాడిచేసి కొట్టారని డొంకరోడ్డు 5వ లైన్‌కు చెందిన యడ్లపాటి సునీత అనే మహిళ సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి... డొంకరోడ్డుకు చెందిన కోటపాటి లక్ష్మి కిడ్నీ దెబ్బతినడంతో ఆమె కుమారుడు సురేష్ కిడ్నీ దానం చేశారు. ఈ మేరకు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గత ఏడాది మే 26న కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ ఖర్చులకు గాను 8లక్షలు, ఆసుపత్రిలో వివిధ రకాల పరీక్షలకు 3లక్షలు, బయట ల్యాబ్‌లో వైద్యపరీక్షలకు మరో 4లక్షలు మొత్తం రూ.15లక్షల బిల్లు అయిందని కోటపాటి లక్ష్మి కుమార్తె సునీత తెలిపారు. ఈ ఆపరేషన్ నిమిత్తం తమకు డొంకరోడ్డులో ఉన్న ఇంటిని విక్రయించినట్లు తెలిపారు. తమ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమేనని, ఈ క్రమంలో సీఎం రిలీఫ్ ఫండ్ కానీ, మెడికల్ రియింబర్స్‌మెంట్ కానీ ఇప్పించాలని కోరుతూ గత నెలలో గ్రీవెన్స్‌లో సీఎం చంద్రబాబును కలిసి వేడుకున్నామన్నారు. ఆపరేషన్‌కు సంబంధించిన మెడికల్ బిల్లులు తెస్తే ప్రతి నెల పెన్షన్‌తోపాటు ప్రభుత్వపరంగా సహాయం అందిస్తామని చెప్పారన్నారు. ఈ క్రమంలో తాము కొద్దిరోజులుగా తమకు ఆపరేషన్ చేసిన ఆసుపత్రి చుట్టూ బిల్లుల కోసం తిరుగుతుంటే వారు సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారన్నారు. చివరకు డొంకరోడ్డుకు చెందిన రమణయ్య అనే వ్యక్తి ఫోన్ చేసి మీకు మెడికల్ బిల్లులు ఇవ్వాలంటే డాక్టర్ జీఎస్టీ 30శాతం చెల్లించాల్సి ఉంటుందని చెప్పారన్నారు. మెడికల్ బిల్లులు సోమవారం ఇస్తామని పిలిచి, ఆసుపత్రికి వెళ్తే తమపై సిబ్బంది వైద్యుడి సమక్షంలోనే దాడి చేసి కొట్టారని బాధితురాలు సునీత వాపోయారు. తమపై దాడి చేసిన, చేయించిన సిబ్బంది, వైద్యునిపై చర్యలు తీసుకొని తమకు మెడికల్ బిల్లులు ఇప్పించాలని ఆమె పోలీస్ అధికారులను వేడుకున్నారు.

52,954 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 36,162 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 33,928 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 20,098 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	17000	334	8000	16000
నెంబరు. 5	8500	12000	నెంబరు. 5	11700	14200
273	10000	11500	273	11500	14000
341	9000	15500	341	10000	10000
4884	–	–	4884	12000	13500
సూపర్ 10	–	–	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18800	తేజ	8500	18500
బ్యాడిగి	9000	14500	బ్యాడిగి	9000	12500
దేవనూరుడీలక్స్	9000	13000	దేవనూరుడీలక్స్	11000	13500
తెల్లకాయలు	4500	11000	తెల్లకాయలు	5000	10000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



తంగెడ రోడ్డుపై ప్రమాదకరంగా ఏర్పడివున్న భారీ గుంతలు

ప్రయాణం.. ప్రాణ సంకటం

- భారీ గోతులతో ప్రమాదకరంగా తంగెడ రహదారి
- టీడీపీ హయాంలో రూ. 20 కోట్లతో నిర్మాణం
- వైసీపీ ఐదేళ్లలో మరమ్మతులకు ఒక్క రూపాయి ఇవ్వని వైనం
- నిత్యం ప్రమాదాలతో క్షతగాత్రులవుతున్న వాహనదారులు

దాచేపల్లి, ఆగస్టు 19: టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.20 కోట్లలతో నిర్మించిన తంగెడ రహదారి నేడు గోతులమయమై ప్రయాణీకులకు ప్రాణ సంకటంగా మారింది. దాచేపల్లి నుంచి తంగెడ కృష్ణానది రేవు వరకువున్న 20 కిలోమీటర్ల దూరాన్ని రెండు వరుసల రోడ్డుగా 20 కోట్ల రూపాయలతో గత టీడీపీ ప్రభుత్వం నిర్మించింది. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రహదారి మరమ్మతులకు ఒక్క రూపాయి నిధులు కూడా మంజూరు చేయకపోగా రోడ్డుపై ఏర్పడిన గోతులను కూడా పూడ్చలేదు. దాచేపల్లి నుంచి తంగెడ గ్రామం వరకు అక్కడి నుంచి కృష్ణానదిపై నిర్మించిన బ్రిడ్జితో తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాల ప్రజలు, వాహనాల రాకపోకలకు ఈ మార్గం అనువుగావుంది. దాచేపల్లి, మఠంపల్లి, హుజుర్‌నగర్, మేళ్లచెరువు మండలా ల్లోవున్న 12 సిమెంట్ ఫ్యాక్టరీలకు చెందిన ఉత్పత్తులు ఈ రహదారి మీదుగానే నెల్లూరు, చెన్నై, విజయవాడ వంటి నగరాలకు తరలి పోతుంటాయి. అంతేకాకుండా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మఠంపల్లి, పెనుగంచిప్రోలు లక్ష్మీతిరుపతమ్మ తల్లి దేవాలయం, లక్ష్మీనరసింహస్వామి వేలాద్రి దేవాలయాలకు ఈ రహదారే ప్రధాన మార్గంగా వుంది. ఇంతటి ప్రాధాన్యం కలిగిన రహదారి గోతుల మయంగా ఉంది. భారీ వాహనాల రాకపోకలతో ఈ రహదారి అంతా గోతుల మయంగా మారింది. ఎంతో మంది గోతుల్లో పడి గాయాలపాలైన వారు కాళ్లు, చేతులు విరగ్గొట్టుకున్నవారు అధికంగా వున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీసం రహదారిపై ఏర్పడిన గోతులను పూడ్చి వాహన చోదకులకు, ప్రయాణీకులకు అసౌకర్యం లేకుండా చూడాల్సిందిగా ఈ ప్రాంత ప్రయాణీకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



పీహెచ్‌సీకి బేబీ వార్మర్‌ను బహుకరిస్తున్న టీడీపీ నేతలు

టీడీపీ నేతల ఔదార్యం అభినందనీయం

రెంటచింతల, ఆగస్టు 19: అప్పుడే జన్మించిన శిశువు శరీర ఉష్ణోగ్రతను క్రమబద్దీకరించేందేరే బేబీ వార్మర్ వైద్య పరికరం అవసరమని, దానిని టీడీపీ నేతలు బహూకరించడం అభినందనీయమని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు డాక్టర్ ఎన్.కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మాజీ ఎంపీటీసీలు పల్లెర్ల అరుణా లక్ష్మారెడ్డి, యెనిగండ్ల రమేష్, టీడీపీ నేత ఆదూరి శివలతో పాటు బీసీ నేత కట్టెబోయిన సైదులు తదితరులు కలిసి స్థానిక పీహెచ్‌సీకి బేబీ వార్మర్‌ను అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీహెచ్‌సీ అభివృద్ధికి తమవంతు సాయం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

తుమ్మలచెరువులో హత్యపై పోలీసుల విచారణ

పిడుగురాళ్ల, ఆగస్టు 19: గేదెలు మేపుకునేందుకు వెళ్లి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతకగా పొలంలో పడివున్న నల్లమేకల సైదమ్మ మృతిపై పోలీసులు అన్ని కోణాలలో విచారణ చేపట్టారు. ఆదివారం జరిగిన సైదమ్మ హత్యపై సోమవారం పోలీసులు మరోసారి సంఘటనా స్థలాన్ని సందర్శించడంతో పాటు సైదమ్మ మృతిపై గ్రామస్థులను, పలువురు అనుమానితులను పోలీసులు విచారించారు. అయితే నల్లమేకల సైదమ్మ, ఆమె చెల్లెలు పేరమ్మకు మధ్య ఎన్నో ఏళ్లుగా పొలం వివాదం నడుస్తుంది. ఆ క్రమంలో సైదమ్మ కుటుంబం, పేరమ్మ కుటుంబాల మధ్య తగంలో తగాదాలు జరిగాయి. ఈ నేపథ్యంలో సైదమ్మ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ వినోద్‌కుమార్

ఆటో డ్రైవర్లు లైసెన్సు కలిగి ఉండాలి

గురజాలటౌన్, ఆగస్టు 19: ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని గురజాల ఎస్ఐ వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కల్వర్టుపై ఏర్పడిన గుంత ఫిర్యాదుకు ముందు.. ఫిర్యాదు తర్వాత

ఎమ్మెల్యేకు సమస్యపై వాట్సాప్ సందేశం

- రెండేళ్లుగా వేధిస్తున్న సమస్యకు నిమిషాల్లో పరిష్కారం
- తక్షణ స్పందనతో ఎమ్మెల్యేపై స్థానికుల ప్రశంసలు

గురజాలటౌన్, ఆగస్టు 19: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే రహదారిలో గుంత ఏర్పడి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓ యువకుడు ఈ గుంతను ఫోటో తీసి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు వాట్సాప్ ద్వారా పంపారు. స్పందించిన ఎమ్మెల్యే యరపతినేని సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నిమిషాల వ్యవధిలో అధికారులు అక్కడకు చేరుకొని గుంతను పూడ్చివేశారు. వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుపై పట్టణ ప్రజలు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. రెండేళ్ల క్రితం వైసీపీ హయాంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద కల్వర్టు నిర్మించారు. పనులు నాసిరకంగా జరగడంతో కల్వర్టు మధ్య భాగంలో గుంత పడింది. ప్రధాన రహదారి కావడంతో అటుగా వెళ్తున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిపై గత వైసీపీ పాలకులకు, అధికారులకు ఎన్నిమార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. తాజాగా ఓ యువకుడు గుంతను ఫోటో తీసి వాట్సాప్ ద్వారా పంపడంతో స్పందించిన ఎమ్మెల్యే యరపతినేని నిమిషాల వ్యవధిలోనే సమస్యను పరిష్కరించారు.

దాచేపల్లి ఎంపీపీగా కందుల జాన్

దాచేపల్లి, ఆగస్టు 19: దాచేపల్లి మండల పరిషత్ అధ్యక్షుడిగా సారంగపల్లి అగ్రహారం గ్రామానికిచెందిన కందుల జాన్ నియామకమయ్యారు. సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత అధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో దాచేపల్లి ఎంపీడీవో శోభారాణి నియామక పత్రాలను కందుల జాన్‌కు అందజేశారు. ఇప్పటివరకు ఎంపీపీగా కొనసాగిన పెదగార్లపాడు గ్రామానికి చెందిన కటకం జయశ్రీ అనారోగ్య కారణాలతో సెలవు పెట్టడంతో మండల పరిషత్ ఉపాధ్యక్షుడుగా పనిచేస్తున్న జాన్‌ఎంపీపీగా నియమించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఎం.కృష్ణకుమారి, అధికారులు పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులకు రూ.1.18 కోట్లు

- మండలంలో గ్రామాల వారీగా గ్రాంట్లు విడుదల
- వివరాలు వెల్లడించిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల,ఆగస్టు19: మండలంలో రహదారుల మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.18 కోట్లు విడుదలైనట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలోని రహదారులన్నీ అధ్వానంగా తయారయ్యాయని, ఎక్కడా ఏ వైసీపీ నేత తట్టెడు మట్టి పోసి మరమ్మతులు చేసిన దాఖలాలు లేవని అన్నారు. అందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మొట్టమొదటిగా గ్రామాల్లో రహదారుల మరమ్మతులకు నిధులు విడుదల చేస్తున్నారని తెలిపారు. సోమవారం రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విడుదలైన నిధులు, పనుల వివరాలను వెల్లడించారు. పాలువాయి జంక్షన్ నుంచి పుణ్యక్షేత్రమైన సత్రశాలకు 11 కి.మీ 294 మీటర్లకు గాను రూ.40 లక్షలు, పాలువాయి జంక్షన్ నుంచి తుమ్మకోట వరకు 6 కి.మీకు గాను రూ.18 లక్షలు, మిట్టగుడిపాడు నుంచి సమాధానం పేట వెళ్లే రోడ్డుకు 4 కి.మీకు గాను రూ.20 లక్షలు,గోలి గ్రామ సమీపంలోని గోలి వాగుపై బ్రిడ్జి నిర్మించడంతో పాటు ఇరు వైపులా 200 మీటర్ల సీసీ రోడ్డు వేసే నిమిత్తం రూ.40 లక్షలు విడుదలైనట్లు బ్రహ్మానందరెడ్డి చెప్పారు.రాష్ట్ర విపత్తుల నిర్వహణ అత్యవసర నిధుల నుంచి రూ.1.18 కోట్లు విడుదలైనట్లు పేర్కొంటూనే సీఎం చంద్రబాబు చొరవ,రహదారుల మంత్రి బీసీ జనార్ధనరెడ్డి తక్షణమే స్పందించడంతో రహదారులకు మహర్దశ పట్టనున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 22 కల్లా ఈ పనులు చేయాలని ఆయన కోరారు.ఈ విలేకరుల సమావేశంలో గోగుల వెంకట్రామిరెడ్డి,శీలంనేని శివ తదితరులున్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో
ఎమ్మెల్యే కన్నా పూజలు



అర్చకుల నుంచి ఆశీర్వచనాలు పొందుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

రాజుపాలెం, ఆగస్టు 19 : మండల కేంద్రమైన రాజుపాలెం గ్రామంలోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సోమవారం మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సందర్శించి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో, మేళతాళలతో స్వాగతంపలికారు. అనంతరం ఆయన గోత్రనామాలతో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా బాలాజీ టెంపుల్ ట్రస్ట్ చైర్మన్ పొత్తూరి వెంకటరమసుబ్బారావు, ఆలయ కమిటి సభ్యులు శాలువాలతో ఎమ్మెల్యే కన్నాను ఘనంగా సత్కరించారు. ఆలయ ప్రాంగణంలో బెల్లంకొండకు చెందిన బ్రహ్మశ్రీ పులుపుల వేంకట ఫణికుమార్‌శర్మచే వేంకటేశ్వర తత్వవైభవంపై ప్రవచనం కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. అనంతరం ప్రదర్శించిన భక్త చింతామణి సాంఘిక పద్యనాటకం భక్తులను అలరించింది.

అనంతరం ఎమ్మెల్యే కన్నా కూటమి నాయకులతో, కార్యకర్తలతో సమావేశమాయ్యారు. ఈ సందర్భంగా కూటమి నేతలు బీసీ హస్టల్ విద్యార్థులు సమస్యలతో సతమతమవులతున్నారని కన్నా దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా పులిచింతల పునరావస కేంద్రానికి చెందిన పలువురు తమకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు ఇవ్వలేదని, తమరి చేతుల మీదుగా పత్రాలు ఇవ్వాలని కోరగా కన్నా స్పందించి అక్కడే ఉన్న తహసీల్దార్ పిలిచి ఆయా కార్యక్రమాన్ని ఈ నెల 24న ఏర్పాటు చేయాలని సూచించారు.

ఎమ్మెల్యే కన్నా వెంట టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పూజల వెంకటకోటయ్య, మండల పార్టీ అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, జనసేన మండల అధ్యక్షులు తోట నరసయ్య, మండలాభివృద్ధి కమిటి మాజీ చైర్మన్ నర్రా బాబురావు, మాజీ ఎంపీపీ గుత్తా వెంకట్రావు, మాజీ జడ్పీటీసీ మర్రి వెంకట్రామిరెడ్డి, పార్లమెంటు కమిటి సభ్యులు అంకాళ్ల ప్రభుదాసు, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు చిన్నబోయిన రాఘవయాదవ్, టీడీపీ మండల మాజీ అధ్యక్షులు అంచుల నరసింహరావు, నియోజకవర్గ టిడిపి అధికార ప్రతినిధి షేక్ అల్లాబక్షు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి లంకా వీరయ్య, సర్పంచ్‌లు కణదం పద్మశ్రీను, పేతురు, పసుపులేటి వెంకటస్వామి మాజీ సర్పంచ్‌లు సఖినాల వలరాజు, పులిబండ్ల సాంబ శివరావు, జెట్టి కోటేశ్వరరావు, వాసా వెంకటేశ్వర్లు, తోట వెంకటశివ, వాణిజ్య విభాగం అధ్యక్షులు తోట శ్రీను, పగడాలశ్రీను, కొత్తూరు యల్లయ్య లేబాకుల బ్రహ్మయ్య, టీడీపీ శ్రేణులు పలువురు ఉన్నారు.



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఐద్వా నేతలు

సానుభూతికాదు.. న్యాయం కావాలి

- కలకత్తా ఘటనను ఖండిస్తూ మహిళల నిరసన

సత్తెనపల్లి, ఆగస్టు 19: పశ్చిమ బెంగాల్‌లో ట్రైనీ వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్య ఘటనపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమత బెనర్జీ నిరసన ఆందోళనలో పాల్గొని సానుభూతి తెలపటం సరికాదని, ఇప్పుడు బాధిత కుటుంబానికి కావాల్సింది న్యాయమని ఐద్వా నేతలు అన్నారు. ఆ అమానుష ఘటనను ఖండిస్తూ సోమవారం పట్టణంలోని కొత్తపేటలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ప్రభుత్వం ఈ ఘటనలో వైద్యురాలిని హత్య చేసిన మృగాలను కాపాడేందుకు ప్రయత్నిస్తుందని ఐద్వా నేతలు ఆరోపించారు. వైద్య విద్యార్థి కుటుంబానికి న్యాయం చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గద్దె ఉమశ్రీ, గర్నెకోట విమల, గుంటుపల్లి రజిని, పలువురు ఐద్వా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం లోడు వాహనం బోల్తా..

సత్తెనపల్లిరూరల్, ఆగస్టు19: మండలంలోని కంటెపూడి సమీపంలో సోమవారం సత్తెనపల్లి నుంచి గుంటూరు వైపు వెళ్తున్న ధాన్యం లోడు వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఆ సమయంలో ఎదురుగా ఎటువంటి వాహనాలు రాకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో వాహన డ్రైవరుకు స్వల్ప గాయాలైనట్టు సమాచారం. వాహనం రహదారిపై పడి పోవటంతో కొద్ది సేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దారు



బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దారు క్షమారాణి

మాచవరం, ఆగస్టు 19: మాచవరం తహసీల్దారుగా క్షమారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పల్నాడుజిల్లా కలెక్టరేట్‌నుంచి డిప్యుటేషన్‌పై క్షమారాణిని తహసీల్దారుగా నియమించారు. ఎన్నికల బదిలీలలో భాగంగా ఇక్కడ పనిచేసిన తహసీల్దారు రామకృష్ణ బదిలీపై సొంత జిల్లా అయిన ప్రకాశంనకు వెళ్లారు. ఈ సందర్భంగా తహసీల్దార్ క్షమారాణి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని, మండలంలోని ప్రజలూ తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.



ఎస్ఐ సుధీర్‌కుమార్‌ను సన్మానిస్తున్న కూటమి నేతలు

ఎస్ఐ సుధీర్‌కుమార్‌కు సత్కారం

దుర్గి, ఆగస్టు 19: దుర్గి పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ సుధీర్‌కుమార్‌ను సోమవారం కూటమి నేతలు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు సమస్యలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వంకమళ్ల కోటేశ్వరరావు, శ్రీరాం కాశీబాబు, నూరె వెంకటేశ్వర్లు, ఆకుల చిన చెన్నయ్య, లక్ష్మణ్, జనసేన నాయకులు పులి హరి, తోటకూర శ్రీనివాసరావు, రుద్రాల రవి, బీమా అమరయ్య, నూరె బాలసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలపై ఎస్సీ, ఎస్టీ కేసు

కారంపూడి, ఆగస్టు 19: టీడీపీ బీసీ సెల్ కన్వీనర్ గోరంట్ల నాగేశ్వరరావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు తుపాకుల చిన రత్తయ్యలపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రటనలో పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీన గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించేందుకు వచ్చిన సర్పంచ్ రమావత్ ప్రమీలాబాయి, ఆమె భర్త తేజానాయక్‌ను దుర్భాషలాడి పతాక ఆవిష్కరణ చేయకుండా వెళ్లగొట్టారని, వారి స్థానంలో మరొకరితో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిచారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సర్పంచ్ ప్రమీలాబాయి తేజానాయక్ ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు వారిద్దరిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మాచర్ల రూరల్, ఆగస్టు 19: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మండలంలోని విజయపురిసౌత్‌లో చోటుచేసుకుంది. విజయపురిసౌత్ కృష్ణవేణి ఘాట్ పక్కన ఉన్న లేక్‌వ్యూ గెస్ట్ హౌస్ ఖాళీ ప్రాంతంలో సోమవారం గుర్తు తెలియని మృతదేహం పూర్తిగా ఖాళీపోయిన స్థితిలో కనిపించింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ నఫీజ్‌బాషా సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. వీఆర్వో శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు విజయపురిసౌత్ ఎస్ఐ పట్టాభి రామయ్య తెలిపారు.



ఉపఖజానా అధికారి అంజనేయులును సన్మానిస్తున్న సిబ్బంది

ఉపఖజానా అధికారికి ఘన సన్మానం

పెదకూరపాడు, ఆగస్టు 19 : పెదకూరపాడు ఉప ఖజానా అధికారి సంకుల ఆంజనేయులు ఈనెల 15వ తేదీన జిల్లా స్థాయిలో ఉత్తమ అధికారిగా అవార్డును అందుకున్నారు. ఆయనకు స్థానిక ఉప ఖజానా కార్యాలయంలో సోమవారం శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉప ఖజానా కార్యాలయ సీనియర్ ఎకౌంటెంట్ గుంటుపల్లి మధుబాబు, జూనియర్ ఎకౌంటెంట్ మొగిలి ఏడుకొండలు, షరాబ్, అన్నపురెడ్డి రాజశేఖరరెడ్డి, ఎం.మనీష్‌బాబు, నేలపాటి శ్రీవలి తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత గ్రంథాల పంపిణీ

అచ్చంపేట, ఆగస్టు 19 : మండల కేంద్రమైన అచ్చంపేటలోని సాయిబాబా కళ్యాణమండపంలో సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు కడకండ్ల లక్ష్మణాచారి ఆధ్వర్యంలో భక్తులకు భగవద్గీతను అందించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో రాఖీ పౌర్ణమి, హైగ్రీవ స్వామి జయంతి సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ షష్టియాబ్దీ సందర్భంగా ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 15 గ్రామాల విశ్వ హిందూ పరిషత్, బీజేపీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కడకంట్ల లక్ష్మణాచారి, వీరశేఖర్, మొదలు వెంకటేశ్వరరావు, పీ ఆంజనేయులు, జే తిరుపతి స్వామి తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు భగవద్గీతలు అందిస్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మణాచారి



సత్తెనపల్లి పట్టణంలోని 19, 20వ వార్డుల సచివాలయానికి సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చిత్రపటాలను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎలినేడి రామస్వామి, రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు, నేతలు మారెళ్ల మల్లేశ్వరరావు, జింకా లోకేశ్వరరావు, మారెళ్ల స్వామి, తోట కొండ తదితరులు బహూకరించారు. - సత్తెనపల్లి

'డయల్ యువర్ ఎమ్మెల్యే ప్రవీణ్'

- ప్రతి మండలానికి ఒక ప్రజా సేవక్ నియామకం
- సమస్యలపై ఫిర్యాదుకు ఫోన్ నంబర్లు

పెదకూరపాడు, ఆగస్టు 19 : పెదకూరపాడు నియోజకవర్గంలో ప్రజా సమస్యల తక్షణ పరిష్కారం కోసం స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ 'డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను సోమవారం ఒక ప్రకటనలో ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది వెల్లడించారు. ప్రతి మండలానికి ఒక ప్రజా సేవక్ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఉంటారని వారు వివరించారు. ప్రధానంగా గ్రామాల్లోని పారిశుధ్యం, సాగు, తాగు నీరు, వ్యవసాయం, విద్య, వైద్యం, రోడ్లు, రవాణా, రెవెన్యూ సమస్యలకు సంబంధించి ఫోన్ చేయవచ్చని వివరించారు. పెదకూరపాడు మండలం ప్రజా సేవక్ ఫోన్ నెంబరు 9493730279, అమరావతి మండలం 9441347537, క్రోసూరు మండలానికి 8985501279, అచ్చంపేట 8985570279, బెల్లంకొండ మండలం 8985808279 కాగా, ఈ నెంబర్లలో డయల్ యువర్ ఎమ్మెల్యే ప్రవీణ్‌కు ఫోన్ చేయవచ్చని వారు వివరించారు.

జైళ్లశాఖలో బదిలీలకు అవకాశం కల్పించాలి

సత్తెనపల్లి, ఆగస్టు 19 : జైళ్ళశాఖ ఉద్యోగుల బదిలీలకు అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ జైళ్ళశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నంబుల విశ్వేశ్వరరావు ముఖ్యమంత్రిని, రాష్ట్ర హోంమంత్రిని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం విడుదలచేసిన ఉద్యోగుల బదిలీ ఉత్తర్వుల్లో అనుమతించిన శాఖనందు, ఆంధ్రప్రదేశ్ జైళ్ళ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల బదిలీల గురించి ప్రస్తావనే లేదన్నారు. జైళ్ళశాఖలో దిగువ శాఖ ఉద్యోగులైన హెడ్‌వార్డర్లు, చీఫ్ హెడ్‌వార్డర్లు రాష్ట్ర స్థాయి పరిధిలో విధులు నిర్వహించాల్సి ఉన్నందున అనేక మంది ఉద్యోగులు తమ సొంత ప్రాంతాలకు సుదూరంగా విధులు నిర్వహిస్తూన్నారన్నారు. అనేక సంవత్సరాలుగా వివిధ ప్రాంతాల్లో పనిచేస్తూ కుటుంబాలకు దూరంగా ఉంటూ ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదలచేసిన ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ఉత్తర్వుల్లో జైళ్ళ శాఖ ఉద్యోగుల బదిలీకి అవకాశం కల్పించాలని ఆయన కోరారు.

మల్లవరంలో వైద్య శిబిరం నిర్వహించాలి

రెంటచింతల, ఆగస్టు 19: మండలంలోని మల్లవరం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలో జ్వరాలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయన్నారు. ఇప్పటికే పలువురు స్థానిక ఆస్పత్రుల్లోనూ, నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలోనూ చికిత్స పొందుతున్నారన్నారు. పరిస్థితిని తీవ్రతను పరిశీలించి గోలి పీహెచ్‌సీ వైద్యులు తక్షణమే స్పందించి గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని కోరారు.



మెటీరియల్‌తో బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ ప్రతినిధులు

స్టడీ మెటీరియల్ అందజేత

మాచర్లటౌన్, ఆగస్టు 19: బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యాన పట్టణంలోని జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు మెటీరియల్ అందించారు. మొత్తం 70 మంది విద్యార్థులకు రూ.19 వేల విలువైన మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాటి భాస్కరబాబు, హెచ్ఎం సకీనా, హెచ్ఎం రామారావు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకులు హనుమంతరావు

గులాబీ పురుగు నివారణకు లింగార్షక బుట్టలు

- గుడ్డు, పిల్ల దశలో ఉన్న పురుగులను నివారించాలి
- పత్తి రైతులలో ఏడీఏ హనుమంతరావు

క్రోసూరు, ఆగస్టు 19 : ప్రత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణకు పొలంలో లింగార్షక బుట్టలు ఎకరాకు నాలుగు నుంచి ఎనిమిది వరకు ఏర్పాటు చేసుకోవాలని క్రోసూరు ఏడీఏ వీ.హనుమంతరావు సూచించారు. సోమవారం మండలంలోని పీసపాడులో పత్తిపొలాలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. పత్తి రైతులందరూ సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే గులాబీ రంగు పురుగు ఉధృతిని నివారించ వచ్చన్నారు. లింగాకర్షక బుట్టలు ఏర్పాటుచేయటం వలన గులాబీ రంగు పురుగు ఉధృతి, ఉనికి గుర్తించవచ్చన్నారు. ట్రైకో గామా పరాన్న జీవులు అందుబాటులో ఉన్న దగ్గర ఎకరానికి రూ.60వేలు చొప్పున మూడు విడతలుగా వారం రోజుల వ్యవధిలో విడుదల చేయటం ద్వారా గుడ్డుదశలో ఉన్న పురుగులను నివారించ వచ్చన్నారు. వేప సంబంధిత, క్లోరీ ఫైరీఫాస్ 2.5 మిల్లీమీటర్లు లేదా, ప్రొఫెనోఫాస్ రెండు మిల్లీ లీటర్ల మందును లీటరు నీటికి కలిపి సాయంత్రం సమయాల్లో పిచికారి చేయటం వల్ల గుడ్డు, పిల్ల దశలో ఉన్న పురుగులను నివారించ వచ్చన్నారు. గులాబీరంగు పురుగువల్ల పత్తి రైతుకుఉ తీవ్ర నష్టం జరుగుతుందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఆయనతో పాటు వీఆర్వో రామచంద్రయ్య, రాజశేఖర్, పవన్ కుమార్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముప్పాళ్ళ ఆగస్టు 19: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఆస్పత్రిపాలైన యువకుడు చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్ఐ హజరత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి మండలంలోని బొల్లవరం అడ్డరోడ్డు వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు గాయాలపాలు కాగా వారిని చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు. వీరిలో తెల్లగొర్ల వంశీ(18) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మాదల గ్రామానికి చెందిన రాచకొండ మురళీకృష్ణ, కుందురువారి పాలెంకు చెందిన సింకా నాగరాజులు చికిత్స పొందుతున్నారు. మృతుడు వంశీ నకరికల్లు మండలం రూపెనగుంట్ల గ్రామస్థుడు. ఆదిలక్ష్మి, నాగేశ్వరరావుల ఏకైక కుమారుడు వంశీ. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ హజరత్తయ్య తెలిపారు.

వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలి

- జల్ జీవన్ మిషన్ జిల్లా కో-ఆర్డినేటర్ టీ.రంగారావు

సత్తెనపల్లిరూరల్, ఆగస్టు 19: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, అప్పుడే వ్యాధులు దరిచేరకుంటా ఉంటాయని జల్ జీవన్ మిషన్ జిల్లా కో-ఆర్డినేటర్ టీ.రంగారావు అన్నారు. జల జీవన్ మిషన్ డీపీఎంయూ ఆధ్వర్యంలో మండలంలోని అబ్బూరు జడ్పీ హైస్కూల్లో డయేరియా వ్యాధిపై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని, భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలన్నారు. సద్ది పదార్థాలు తిన వద్దని, వేడి ఆహారం మాత్రమే తీసుకోవాలని, గోరు వెచ్చని నీరు తాగాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. డయేరియా వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పాపయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు రోజురోజుకు జ్వర పీడితుల సంఖ్య పెరుగుతుంది. నాలుగు వార్డులకు గాను 40 మంచాలు ఉండగా 60 మంది రోగులు చికిత్స పొందుతున్నారు. దీంతో ఒకే మంచం పై ఇద్దరు రోగులను ఉంచి వైద్య సిబ్బంది చికిత్స అందిస్తున్నారు. ఆస్పత్రి పైన నిర్మించిన నూతన భవనం ప్రారంభిస్తే కొంత మేరకు సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉందని వైద్యశాల సూపరింటెండెంట్ లక్ష్మణరావు తెలిపారు. - సత్తెనపల్లి

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



ప్రజలు నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఇతర అధికారులు

నిర్ణీత గడువులోగా అర్జీలను పరిష్కరించాలి

● పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణబాబు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 19: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పీ అరుణబాబు అన్నారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం జరిగింది. పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్, జిల్లా రెవెన్యూ అధికారి కే వినాయకంలతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 62 దరఖాస్తులు అందాయి.



కార్యక్రమంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

ఎన్జీవో హోమ్ రిక్రియేషన్ హాల్ నిర్మాణానికి భూమి పూజ

నరసరావుపేట టౌన్, ఆగస్టు 19: నరసరావుపేట పట్టణంలో ఎన్జీవో హోమ్ రిక్రియేషన్ హాల్ నిర్మాణానికి భూమిపూజ సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏపీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కారదర్శి పురుషోత్తమ నాయుడు, జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి సతీష్ కుమార్, పశ్చిమ, కృష్ణ జిల్లా అధ్యక్షుడు ఏ విద్యాసాగర్, తాలూకా అధ్యక్షుడు ఎం.రామకృష్ణ, కార్యదర్శి ఎం.ఆనంద్‌నాథ్, ట్రెజరర్ కోటిరెడ్డి, జాయింట్ సెక్రటరీ రామానుజన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రవికుమార్, డీవీడీ ప్రసాద్, శ్యామల, మాణిక్యమ్మ, మహిళా విభాగం చైర్మన్ టీ అనురాధ, తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగులందరికీ అనుకూలంగా ఉండటం జరుగుతుందని, ఉద్యోగులకు ప్రభుత్వం అన్ని విషయాలలో సహకరించడం జరుగుతుందన్నారు. తనవంతు సాయంగా ఏపీఎన్జీవో రిక్రియేషన్ హాల్ నిర్మాణానికి రూ.లక్ష విరాళం ప్రకటించారు. అదేవిధంగా నిర్మాణానికి తమ సహకారం అందిస్తానని చెప్పారు. గుంటూరు జిల్లా అసోసియేషన్ రూ.లక్ష, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గురజాల తాలుకా యూనియన్ రూ.లక్ష, సత్తెనపల్లి తాలూకా యూనిట్ రూ.లక్ష, వినుకొండ, బాపట్ల, తెనాలి యూనిట్‌లు రూ.50 వేల వంతున విరాళాలను ప్రకటించాయి.

వైభవంగా బ్రహ్మంగారి ఆలయ వార్షికోత్సవం

రొంపిచర్ల, ఆగస్టు 19: మండలంలోని కొనకంచివారిపాలెంలోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలను నిర్వహించారు. స్వామివారికి జరిగిన కల్యాణోత్సవంలో దంపతులు పాల్గొన్నారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆలయానికి విద్యుత్ దీపాలంకరణ చేశారు. సాయంత్రం భజనా కార్యక్రమాలను నిర్వహించారు.

కాలువ గట్లపై కంపచెట్లును తొలగించేందుకు చర్యలు

'ఆంధ్రజ్యోతి'కి స్పందన

ఈపూరు, ఆగస్టు 19: నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువకు ఇరువైపులా గట్టులపై కంపచెట్లు అలుకుపోవడంపై ఆంధ్రజ్యోతి జిల్లా ఎడిషన్‌లో సోమవారం ప్రచురితమైన కథనానికి ఎన్నెస్పీ అధికారులు స్పందించారు. కాలువకట్టకు రెండు వైపులా కంప చెట్లను తొలగించేందుకు అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారుల ఆమోదం కోసం పంపడం జరుగుతుందని ఎన్ఎస్‌పీ వినుకొండ సబ్‌డివిజన్ ఉప కార్య నిర్వహణ అధికారి ఆర్ లక్ష్మణరాజు తెలిపారు. కంప చెట్లు తొలగింపు సమయంలో కాలువ నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం ఉండదన్నారు.

పోట్లూరు వాసికి డాక్టరేట్



అబ్బూరి రామారావు

పోట్లూరు (శావల్యాపురం) ఆగస్టు 19: పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం పోట్లూరు గ్రామానికి చెందిన అబ్బూరి రామారావుకు కృష్ణా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. వ్యవసాయ కుటుంబానికి చెందిన రామారావు తల్లిదండ్రులు అబ్బూరి చిన్నకోటయ్య, రుక్మిణమ్మల ప్రోత్సాహంతో ఉన్నత చదువులను అభ్యసించాడు. డాక్టర్ జి.వెంకట్రావు, ఎంవీబీ రావుల పర్యవేక్షణలో రామారావు రసాయనశాస్త్రంలో పరిశోధన చేసి డాక్టరేట్‌ను సాధించారు. రామారావు పరిశోధన పత్రాలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్ సదస్సులలో సమర్పించబడ్డాయి. గతంలో రామారావు ఎరాస్మస్ స్కాలర్‌షిప్, ఐరోపా సమాఖ్య నుంచి రసాయనశాస్త్రంలో మాస్టర్స్ అడ్వాన్స్‌డ్ స్పెక్ట్రోస్కోపీలు అందుకొన్నారు. రామారావు స్కాలర్‌షిప్‌తో జర్మనీ, నార్వేలలో విద్యను అభ్యసించారు. ఎరాస్మస్ భారత విభాగానికి నిర్వహించిన ఎన్నికలలో రామారావు భారీ మెజారిటీతో గెలుపొంది అధ్యక్షుడిగా గుర్తింపు పొందారు. బెల్జియం, ఫ్రాన్స్ దేశాల్లో జరిగిన జనరల్ అసెంబ్లీలో భారత విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను యూరోపియన్ పార్లమెంట్ సభ్యుల దృష్టికి తీసుకెళ్ళి సమస్యలు పరిష్కరించడంలో కీలకపాత్ర పోషించారు.



కమ్మవారిపాలెం ఎస్టీ కాలనీ వాసుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ ట్రైబల్ కమిషన్ మెంబరు వడితే సోమశంకర నాయక్

అభివృద్ధి ఫలాలు అందటకపోవటం శోచనీయం

● ఏపీ షెడ్యూల్ ట్రైబల్ కమిషన్ మెంబరు సోమశంకర నాయక్

నూజెండ్ల, ఆగస్టు 19: గిరిజన ప్రజలు అభివృద్ధి ఫలాలు అందుకోలేక పోవటం శోచనీయమని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ ట్రైబల్ కమిషన్ మెంబరు వడితే సోమ శంకరనాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని కమ్మవారిపాలెం గ్రామంలోని ఎస్టీ కాలనీని సోమ శంకర్ నాయక్ సోమవారం సందర్శించారు. ఇటీవల కొన్ని కుటుంబాల వారు సుబాబులు, సర్వి, జామాయిల్ తోటలను కొట్టేందుకు ఒప్పందంపై తీసుకు వచ్చిన వ్యక్తి వారి హక్కులను హరించేలా వెట్టిచాకిరి చేయించుకోవటం, చిన్న పిల్లలతో పనులు చేయించటంపై సుమోటోగా ఫిర్యాదును స్వీకరించి విచారణ చేస్తున్నామన్నారు. దీనిపై కేసు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. బాధిత కుటుంబాల వారికి ఆశ్రయం కల్పించిన కాలనీలో శాశ్వత గృహ నిర్మాణం, వారికి ఆధార్, రేషన్, ఓటరు కార్డులు ఇప్పించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. 15 రోజుల్లోగా వారి సమస్యలను పరిష్కరించి తెలియ జేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీ రమేష్ కుమార్, ఎంపీడీవో టీ వీరభద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

నూజెండ్ల, ఆగస్టు 19: మండలంలోని సీతారామపురం వెంకటేశ్వరస్వామి కమిటీ హైస్కూల్‌కు చిలకలూరిపేటకు చెందిన పాపసాని అంజిబాబు కంప్యూటర్‌ను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కామేశ్వరరావు శర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీఈటీ జీ విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫొటో గ్రాఫర్లకు అవార్డులు ప్రదానం

వినుకొండ, ఆగస్టు 19: ప్రపంచ 185వ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఇటీవల నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన పోటీల్లో బ్లాక్ అండ్ వైట్ విభాగంలో వంగపల్లి బ్రహ్మంకు ఇమేజ్ అవార్డు, కలర్ ఫొటో విభాగంలో కేసానుపల్లి సుబ్బారావుకు అప్రిసియేషన్ అవార్డులు ఈనాడు ఎడిటర్ ఎం.నాగేశ్వరరావు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నుంచి సోమవారం అందుకున్నారు.

రక్షణగా నిలిచే వారిని గౌరవించటం గొప్ప సంప్రదాయం

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



ఎమ్మెల్యే జీవీకి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు, తెలుగు మహిళలు

వినుకొండ, ఆగస్టు 19: సమాజంలో స్త్రీకి రక్షణగా నిలిచేవారిని గౌరవించుకునే సంప్రదాయానికి ప్రతీక రాఖీపౌర్ణమి అని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా జీవీ ఆంజనేయులుకు పట్టణంలోని బ్రహ్మకుమారీలతో పాటు, తెలుగు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రాఖీలు కట్టారు. ఈసందర్భంగా ఆంజనేయులు వారికి రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ సోదర, సోదరీమణుల మధ్య ఆత్మీయ అనురాగాలు ఉండే పండుగే రక్షాబంధన్ అన్నారు. రాష్ట్రంలో అక్కాచెల్లెళ్ల సంక్షేమం విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎవరూ సాటిరారని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పేగు బంధం పంచుకుని పుట్టిన అక్కా చెల్లేకాదు, మన జీవితంలో వివిధ సందర్భాల్లో ఎదురయ్యే ప్రతి సోదరికీ అండగా నిలవడం మనందరి బాధ్యతన్నారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీలో అధికారంలో ఉన్నప్పుడల్లా అక్కాచెల్లెమ్మలకు అగ్రస్థానం అందించామని తెలిపారు. ఆడపడుచులకు రాజకీ ప్రాధాన్యం కల్పించి ఆస్తిలో హక్కు కల్పించింది అన్న నందమూరి తారక రామారావు అని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు అక్కచెల్లెళ్లల గురించి నిరంతరం ఆలోచిస్తున్నారని తెలిపారు. నాడు డ్వాక్రా సంఘాల నుంచి, నేటి పీ-4 కాన్సెప్ట్ ద్వారా పేదరికం లేని సమాజం సాధించేందుకు కృషి చేస్తున్నారన్నారు. డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసి రుణసాయం పెంచి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని చంద్రబాబు ఆకాంక్ష అన్నారు.

జూనియర్ కళాశాల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలి

వినుకొండ టౌన్, ఆగస్టు 19: వినుకొండ జూనియర్ కళాశాల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలంటూ జూనియర్ కళాశాల విద్యార్థులు స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రాష్ట్ర యువసేన విద్యార్థి సంఘం అధ్యక్షుడు సంపెంగుల రవికుమార్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం రద్దుచేశారని, గత టీడీపీ హయాంలో ప్రవేశపెట్టిన పథకాన్ని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకు వెళతానన్నారు. పథకం ప్రారంభం అయ్యే లోపు అన్న క్యాంటీన్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇజ్రాయేల్, కోటేశ్వరరావు, సుబ్బారావు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదులు వెల్లువ



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 19: పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఎస్పీ కంచి శ్రీనివాసరావు బాధితుల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెద్దరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఏరువ శివారెడ్డి కుమారులు ఎన్నికల సమయంలో తిరుపతిరావుతో రూ.10లక్షలు పందేలు వేసుకున్నారన్నారు. శివారెడ్డి కొడుకు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకోవడంతో శివారెడ్డిని ఆ నగదు చెల్లించాలంటూ తిరుపతిరావు బెదిరిస్తున్నట్లు ఫిర్యాదు చేశాడు. ఈపూర్ మండలం బొగ్గరం గ్రామానికి చెందిన ఆదినారాయణమ్మకు చెందిన నాలుగు సెంట్లు స్థలంలో ఇల్లు ఉంది. ఆ ఇంటిని అమ్మకానికి పెట్టగా స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లను గోపు భూలక్ష్మి దొంగ దస్తావేజులు చేయించి అమ్ముకోనివ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదు చేసింది. గొల్లపల్లి మండలం సరికొండపాలెంకు చెందిన మంత్రులనాయక్‌కు ఎకరా 70సెంట్లు పొలంను బాలునాయక్ కౌలుకు తీసుకుని మూడు సంవత్సరాల నుంచి కౌలు చెల్లించకుండా బెదిరిస్తున్నట్లు ఫిర్యాదు చేశాడు. మాచర్ల పట్టణానికి చెందిన చిల్లర ఉషారాణి సంవత్సరం క్రితం పవన్ అనే వ్యక్తి తనకు స్థలం ఇప్పిస్తానని రూ.5 లక్షలు, ఒక గోల్డ్‌చైన్ తీసుకుని స్థలాన్ని గానీ, డబ్బులు గానీ ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నరని ఫిర్యాదు చేశారు. మాచర్ల పట్టణం శాంతినగర్‌కు చెందిన కుమారి తనకు ఏడుకొండలుతో 20 సంవత్సరాల క్రితం వివాహం జరిగిందని, తన భర్త తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. ముప్పాళ్ళ మండలం చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన వెంపరాల రామలింగేశ్వరి తన భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేసింది అచ్చంపేట మండలం పెదపాలెం గ్రామానికి చెందిన అంబటి నరసింహారావు మరికొంత మంది రైతులు తమ పొలంను మార్కండేయులు శ్రీనివాస్‌కు అమ్మగా రూ.23 లక్షల మాత్రమే చెల్లించి మిగిలినవి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నట్లు ఫిర్యాదు చేశారు సత్తెనపల్లి పట్టణం నాగార్జున నగర్‌కు చెందిన లక్ష్మీ కల్పనబాయి పవన్ కుమార్ అనే వ్యక్తి మాయమాటలు చెప్పి వెటర్నరీ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.3.50 లక్షలు తీసుకొని మోసం చేసినట్లు ఫిర్యాదు చేశారు. నరసరావుపేట పట్టణం రామిరెడ్డిపేటకు చెందిన శెట్టిపల్లి శ్రీనివాసరావుకు ఆంధ్ర బ్యాంకులో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి మల్లేశ్వరరావు ఐదు లక్షలు తీసుకొని మోసం చేసినట్లు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని కెనరా బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్న తన కుమారుడు హరినాథ్‌బాబు తన ఆస్తి మొత్తం తీసుకొని బయటకు గెంటివేసాడని తగున్యాయం చేయాలని బొకేసం రామనాథం అనే వ్యక్తి ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

మెరుగైన పాలన అందించడమే లక్ష్యం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 19 : ప్రజలకు మెరుగైన పాలన అందించటమే లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. సోమవారం నరసరావుపేట పట్టణంలో మున్సిపల్ కమిషనర్, శానిటేషన్ సిబ్బందితో కలిసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ప్రధానంగా కాలువలు, చెత్త, డంపింగ్ యార్డులు, ఖాళీ స్థలాలపై దృష్టి సారించారు. పట్టణంలో శ్మశాన వాటికలలో ప్రత్యేక కార్యాచరణతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు శ్మశాన వాటికలో చెత్త తొలగింపు, మురుగు తొలగింపు కార్యక్రమాలలో పాల్గొన్నారు. సమాధుల చుట్టూ పేరుకున్న పిచ్చి మొక్కలను తొలగించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ గత ఐదేళ్ళగా పాలనను గాలికి వదిలేశారని, నాడు నేడు పేరుతో దోచుకోవడం తప్ప ప్రజలకు కనీస సదుపాయాలపై దృష్టి పెట్టలేదని అన్నారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చాక ప్రజల అవస్థలపై ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. నిత్యం ప్రజలలో ఉంటూ ప్రజల సమస్యలపై పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. నరసరావుపేట నియోజకవర్గాన్ని సుందర పట్టణాలలో చేర్చే వరకు విశ్రమించక పని చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

సుగాలీ కాలనీకి రెండు సీసీ కెమేరాల బహూకరణ



సీసీ కెమెరాలు బహూకరిస్తున్న దాతలు

చిలకలూరిపేట, ఆగస్టు 19: పట్టణంలోని సుగాలీ కాలనీలో ఆ కాలనీ ఉద్యోగుల సంఘం వారు రెండు సీసీ కెమేరాలను బహూకరించారు. కాలనీతో పాటు అక్కడి స్కూల్ వద్ద విద్యార్థుల ఈవ్‌టీజింగ్, బైక్ దొంగతనాలు, గాంబ్లింగ్, గంజ వంటి సంఘ వ్యతిరేక కార్యక్రమాలను అడ్డుకునేందుకు సీసీ కెమేరాలు ఉపయోగపడతాయని ఈ సందర్భంగా దాతలు పేర్కొన్నారు. సంఘం అధ్యక్షులు శ్రీను, మహిళా పోలీసులు సునీత, రమ్య, ఆ వార్డులోని పెద్దలు, స్కూల్ హెచ్‌ఎం తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆసుపత్రి ఎదుట మృతురాలి బంధువుల ఆందోళన

నరసరావుపేట లీగల్, ఆగస్టు 19: సరైన చికిత్స అందక మహిళ మృతి చెందిందంటూ ఆసుపత్రి ఎదుట బంధువులు ఆందోళన చెందిన సంఘటన నరసరావుపేటలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ముప్పాళ్ళ మండలం చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన రమణమ్మ అనే 50 సంవత్సరాల మహిళ సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. సదరు మహిళ బంధువులు సరైన చికిత్స అందకపోవటం వలనే మహిళ మృతి చెందిందంటూ సోమవారం తెల్లవారుజామున కోట సెంటర్లోని వైద్యశాల ఎదుట ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న రెండో పట్టణ ఎస్ఐ అశోక్ బాబు సిబ్బందితో వచ్చి వైద్యశాల సిబ్బందితో మృతురాలి బంధువులతో చర్చించారు. తుదకు పట్టణానికి చెందిన వైద్యుల జోక్యంతో మృతురాలి బంధువులు శాంతించారు.

బొల్లాపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

బొల్లాపల్లి, ఆగస్టు 19: బొల్లాపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని మండల మాజీ తెలుగు యువత అధ్యక్షుడు బొప్పూడి శ్రీనివాసరావు సోమవారం మంగళగిరి జాతీయ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చంనాయుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు రామ్మోహనరావును కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొల్లాపల్లి మండల రైతులను దృష్టిలో ఉంచుకొని కరువు మండలంగా ప్రకటించి రైతులకు సబ్సిడీ ఇవ్వాలని వినతిపత్రంలో తెలిపారు.

పాఠశాలలో కుళాయిల కత్తిరింపు

ఈపూరు,ఆగస్టు19: మండలంలోని కొచ్చెర్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో (మెయిన్) విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన తాగునీరు పైపుల ట్యాపులను కత్తించారు. పాఠశాలకు ఎస్ఎంసీ నూతన కమిటీ ఏర్పాటు జరిగిన కొన్ని రోజులకే పైపులను కట్ చేశారు. పైపులను కత్తిరించటంతో విద్యార్థులు నీటికోసం అవస్థలు పడుచున్నారు. ఎస్ఎంసీ చైర్మన్, కమిటీ సభ్యులుగా టీడీపీ సానుభూతిపరులు ఎన్నిక కావడంతో కక్షతో కొందరు ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చైర్మన్ బీసపోగు రాంబాబు తెలిపారు.



మేజర్ కాలువకు గండిపడి వృథా అవుతున్న నీరు

శావల్యాపురం మేజర్‌కు గండి

శావల్యాపురం, ఆగస్టు 19: అద్దంకి బ్రాంచ్ కెనాల్ నుంచి శావల్యాపురం పొలాలకు సాగునీటిని అందించే మేజర్ కాలువకు గండి పడడంతో సాగునీరు వృథా అవుతుంది. మేజర్ కాలువ పైభాగంలో గండిపడడంతో శావల్యాపురం పొలాలకు సాగునీరు నిలిచిపోయింది. దాంతో వరినాట్లు వేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విస్తారంగా వర్షాలు పడి డ్యాంలలో పుష్కలంగా నీరున్నప్పటికీ కెనాల్‌కు, మేజర్ కాలువలకు గత ఐదేళ్ళుగా మరమ్మతులు నిర్వహించక పోవడంతో కట్టలు బలహీన పడి గండ్లు పడుతున్నాయని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే కాలువల పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఇంకెలా ఉంటుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మేజర్ కాలువలకు గండ్లుపడి రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నా ఎన్నెస్పీ అధికారుల నుంచి స్పందన కరువైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గండ్లు వెంటనే పూడ్పించి సాగునీటిని పునరుద్ధరించాలని, మరోసారి గండ్లు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

టీడీపీ కార్యకర్తల ఘర్షణ

నరసరావుపేట లీగల్ 19: ఆర్థిక అంశాల నేపథ్యంలో టీడీపీలోని ఇరు వర్గాలకు చెందిన కార్యకర్తలు సోమవారం ఉదయం గుంటూరు రోడ్డులోని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆసుపత్రిలో దాడి చేసుకున్నారు. ఈ దాడి వెనుక ప్రధానమైన అంశం ఆర్థికపరమైన అంశాలతో అనే సమాచారం. కాగా పోలీసులు ఈ అంశాన్ని గోప్యంగా ఉంచుతున్నారు. ఈ ఘటనలో ఎటువంటి సంబంధం లేని పట్టణంలోని వరవ కట్టకుచెందిన కరిముల్లా అనే వ్యక్తి చేతికి తీవ్ర గాయం కాగా, ఆరు కుట్లు పడ్డాయి. ఇరువర్గాల వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనపై కేసును నమోదు చేసినట్లు రాత్రికి పోలీసులు వెల్లడించారు.

అంకాలమ్మ ఆలయ వార్షికోత్సవం

వినుకొండ టౌన్, ఆగస్టు 19: పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులోని అంకాలమ్మతల్లి దేవస్థానం ప్రథమ వార్షిక వేడుకలు సోమవారం భక్తులు ఘనంగా నిర్వహించారు ఆలయ ప్రధాన అర్చకులు ఎం సాయిబాబా ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. 6వేల మంది భక్తులకు భారీ అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాది పోట్లూరి సైదారావు, టీడీపీ నాయకులు ల్యాబ్ శ్రీనివాసరావు, నూరేపల్లి స్వామి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రసన్నాంజనేయస్వామి ...

శావల్యాపురం, ఆగస్టు 19: గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలో శావల్యాపురం సెంటర్లో ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో 14వ వార్షికోత్సవ వేడుకలను ఆలయ ధర్మకర్త కర్రి పెదఅంజయ్య ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయపూజారి రావిపాటి సాయిభరత్‌శర్మ ఆధ్వర్యంలో ప్రసన్నాంజనేయస్వామి, సువర్చలాదేవీల ఉత్సవ విగ్రహాలకు పుణ్యదంపతుల చేతులమీదుగా మేళతాళాలతో అంగరంగ వైభవంగా కళ్యాణాన్ని జరిపించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను గ్రామపురవీధులలో ఊరేగించి వైభవంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

ఘనంగా తలార్లపల్లి ..

నూజెండ్ల, ఆగస్టు 19: మండలంలోని తలార్లపల్లిలో నాగారమ్మ తల్లి సహిత నిదానంపాటి లక్ష్మి అమ్మవార్ల దేవస్థానం ఎనిమిదో వార్షికోత్సవం తిరునాళ్ళ సోమవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పరిసర గ్రామాల భక్తులు మొక్కులు చెల్లించుకొని పూజలు నిర్వహించారు.



చిలకలూరిపేట తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

హత్యాచారానికి నిరసనగా భారీ ర్యాలీ

చిలకలూరిపేట, ఆగస్టు 19: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం సంఘటనకు నిరసనగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. పలు సంఘాల నాయకులతో పాటు వివిధ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూల్ వద్ద నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం వరకు సాగింది. తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్‌కు వారు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు, సీపీఐ ఇన్‌చార్జ్ కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ తదితరులు మాట్లాడుతూ ఈ ఘటన దురదృష్టకరమన్నారు. మహిళల భద్రతకు అవసరమైన చర్యలను ప్రభుత్వాలు తక్షణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆరాధ్యుల రామకృష్ణ, బీ భగత్‌సింగ్, మేకపోతుల నాగేశ్వరరావు, తలానీ, డానీ తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్, గిరిజన సంఘం ఆధ్వర్యంలో...

కాగా జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారంపై నిరసనగా ఏఐవైఎఫ్, ఏపీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో కూడా ఆదివారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. స్థానిక కళా మందిర్ సెంటర్‌లో కొవ్వొత్తులు వెలిగించి నిరసన కార్యక్రమం చేపట్టారు. పలు రాజకీయ, ప్రజా సంఘాల నాయకులతో పాటు పలువురు డాక్టర్లు ఈ నిరసనలో పాల్గొన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జరీనా సుల్తానా, ఎం.రత్నకుమారి, రావు సుబ్రహ్మణ్యం, మాదాసు భాను ప్రసాదు, అడపా మోహన్, ఎం.రాధాకృష్ణ, కొల్లా రాజమోహనరావు, మద్దుల వెంకట కోటయ్య, కొండ్రముట్ల నాగేశ్వరరావు, బీ శ్రీనునాయక్, షేక్ సుభానీ, ఎస్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వరం కూటమి ప్రభుత్వ నిర్ణయాలు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఆగస్టు 19: రాష్ట్రంలోని అక్క, చెల్లెమ్మలందరికీ వరంలా కూటమి ప్రభుత్వ నిర్ణయాలు అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. రక్షా బంధన్ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటికి సోమవారం పలువురు తెలుగు మహిళలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేసి ఆయన ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ ఏ ఇల్లు ఐనా ప్రేమ, ఆప్యాయలతో ఎలా ఉండాలని అక్కాచెల్లెళ్ళు కోరుకుంటారో అది అందించటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ శ్రమిస్తున్నారన్నారు. రాష్ట్రాన్నే కుటుంబంగా భావిస్తూ ఇక్కడి ప్రతి మహిళను అక్కా, చెల్లెళ్ళుగా భావిస్తూ మహిళల పక్షపాతిగానే నిర్ణయాలు తీసుకుంటున్నారని కొనియాడారు. తెలుగు మహిళలు గడిచిన ఐదు సంవత్సరాలుగా వైసీపీ రాక్షస, కీచక పాలనలో ఎన్నో అవమానాలు, అవహేళనలు, వేధింపులను తట్టుకొని నిలబడి పార్టీ కోసం శ్రమించారని, నేడు కూటమి ప్రభుత్వం ఇలా ఉందంటే వెలకట్టలేని వారి శ్రమ, త్యాగాలు కూడా ఒక ప్రధాన కారణమన్నారు. వారితో పాటు రాష్ట్రంలోని మహిళలందరికీ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి మేనిఫెస్టోలో అనేక అంశాలు పొందుపరిచామని, వారి కలలకు రెక్కలు అందించేలా ఇక పై వాటి అమలు ఉంటుందని ప్రత్తిపాటి తెలిపారు.

ఫొటో జర్నలిస్టులకు శుభాకాంక్షలు

చిలకలూరిపేట అర్బన్, ఆగస్టు 19: వేల పదాల్లో చెప్పలేని విషయాన్ని ఒక చిత్రంతో చెప్పవచ్చని, అది ఫొటోగ్రఫీకి ఉన్న శక్తి అని మాజీ మంత్రి చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో గతాన్ని, అందమైన అనుభూతులను పదిలంగా భద్రపరచటంలో చాయా చిత్రాలకు ఏవీ సాటిరావన్నారు. సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫొటో జర్నలిస్టులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద కెమెరా చేతబట్టి స్వయంగా ఫొటోలు తీశారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ఫొటోగ్రాఫర్ల పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఈ సందర్భంగా వారికి ప్రత్తిపాటి హామీ ఇచ్చారు.

పూర్వ విద్యార్థి తహసీల్దార్‌కు సత్కారం



తహసీల్దార్‌ను సత్కరిస్తున్న మోడరన్ విద్యా సంస్థల యాజమాన్యం

చిలకలూరిపేట, ఆగస్టు 19: చిలకలూరిపేట తహసీల్దార్‌గా కొత్తగా వచ్చిన షేక్ హుస్సేన్ స్థానిక మోడరన్ విద్యా సంస్థల్లో విద్యాభ్యాసం చేశాడు. ఆయన చిలకలూరిపేటకు చెందిన వాడే. ఈ సందర్భంగా మోడరన్ విద్యా సంస్థల చైర్మన్ చేబ్రోలు మహేష్, వారి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుభానీ, సంతోష్, శ్రీరాములు, విష్ణులు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హుస్సేన్‌ను సత్కరించారు.

పోలీస్ కుటుంబాలకు సహచర ఉద్యోగుల సాయం

నరరావుపేట లీగల్, ఆగస్టు 19: మరణించిన సహోదరులు కుటుంబాలకు తోటి బ్యాచ్ పోలీసులు బాసటగా నిలవడం అభినందనీయమని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ప్రకాశం జిల్లా తాళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ గుంటూరు జిల్లా తుళ్లూరు పరిధిలో బందోబస్తు నిర్వహిస్తూ ఈ ఏడాది మే 24న పాము కాటుతో మరణించిన పవన్ కుమార్ కుటుంబ సభ్యులకు అతని సహచరులు, ఉమ్మడి గుంటూరు జిల్లా పోలీసులు తమవంతు ఆర్థిక సాయంగా రూ.1,10,000లను సేకరించి ఎస్పీ చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు.



దింతెనపాడు గ్రామ పరిధిలో వేసిన మినుము పంటను పరిశీలించి వివరాలు నమోదు చేసుకుంటున్న రైతు శిక్షణా కేంద్రం డీడీఏ శివకుమారి

సమగ్ర సస్యరక్షణతోనే అధిక దిగుబడులు

● డీడీఏ శివకుమారి

యడ్లపాడు, ఆగస్టు 19: సమగ్ర సస్యరక్షణతోనే అపరాల పంటల సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చునని రైతు శిక్షణ కేంద్రం డీడీఏ శివకుమారి అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మాపురం, దింతెనపాడు గ్రామాలలో పర్యటించి అపరాల పంటలైన మినుము, కందితో పాటు వాణిజ్య పంట అయిన పత్తి పొలాలను పరిశీలించారు. మినుము, కంది పంటల సాగులో రైతులు అవలంబిస్తున్న పద్ధతులు, సస్యరక్షణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపరాల పంటలు సాగుచేస్తున్న రైతులు విత్తనాలు ఎంపిక చేసుకునే దశ నుంచే తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే విత్తే ముందు తెగుళ్ల ఆశించకుండా విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. నరసరావుపేట వ్యవసాయ సంచాలకులు మస్తానమ్మ మాట్లాడుతూ పత్తి 45రోజుల దశలో ఉందని, రసం పీల్చే పురుగులు పంటను ఆశిస్తున్నాయన్నారు. నివారణకు వేప సంబంధిత మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు. అలాగే గులాబి రంగు పురుగు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఎరువుల వినియోగం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో సరిత, రైతు సేవా కేంద్రం సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.